పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు



సంపుటి : 11 సంచిక : 294 పేజీలు : 8+8 ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ : పి. గౌతమి ఆదివారం 29 జూన్ 2025

Published form Medchal Malkajgiri, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda

మీడియా సంస్థలపై కేటీఆర్ ఫైర్.. చట్టపరమైన చర్యలకు సిద్ధం

- కొన్ని మీడియా సంస్థలపై బీఆర్ఎస్ నేత కేటీఆర్ తీవ్ర ఆగ్రహం
- తనపై, పార్టీపై విషం కక్కుతున్నారని తీవ్ర ఆరోపణలు
- అందరిపై చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టమైన హెచ్చరిక
- వ్యక్తిత్వ హననంతో కుటుంబం, మిత్రులు ఆవేదన చెందుతున్నారని వెల్లడి
- ఈ దాడుల వెనుక ఎవరున్నారో తనకు తెలుసన్న కేటీఆర్
- భౌతిక దాడికి ఆస్కారం లేదన్న కేటీఆర్

హైదరాబాద్ పెన్ పవర్:బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కొన్ని మీడియా సంస్థలు, జర్నలిస్టుల వ్యవహారశైలిపై తీవ్రంగా మండిపడ్డారు. తనపై, తమ పార్టీ నాయకత్వంపై ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపిస్తూ, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. కొన్ని నెలలుగా కొందరు వ్యక్తులు జర్నలిస్టుల ముసుగులో తన వ్యక్తిత్వాన్ని కించపరిచేలా పదేపదే ఆరోపణలు చేస్తున్నారని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. "జర్నలిస్టుల ముసుగులో కొందరు దుర్మార్గులు గత కొన్ని నెలలుగా నాపైనా, మా పార్టీ నాయకత్వంపైనా విషం చిమ్ముతున్నారు" అని ఆయన అన్నారు. ఇలాంటి వారి అభిప్రాయాలను, ఉనికిని తాను ఏమాత్రం ఖాతరు చేయనని ఆయన తేల్చి చెప్పారు. అయితే, ఈ నిరంతర వ్యక్తిగత దూషణల

వివరాలు 2లో..

'ఎన్ కన్వెన్షన్' తొలగించాక నాగార్జున ప్రభుత్వానికి 2 ఎకరాలు అప్పగించారు!

- హైదరాబాద్ అభివృద్ధి ఆగదన్న రేవంత్ రెడ్డి
- కంచ గచ్చిబౌలి అభివృద్ధిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టత
- కొత్త కంపెనీల ఏర్పాటుతో 5 లక్షల ఉద్యోగాలు సృష్టిస్తామని హామీ
- ఎంతమంది రాక్షసులు అడ్డుపడినా అభివృద్ధి యజ్ఞం ఆగదన్న ముఖ్యమంత్రి
- కాలుష్య నియంత్రణకు 3 వేల ఎలక్ట్రిక్ బస్సుల ఏర్పాటుకు నిర్ణయం

హైదరాబాద్ పెన్ పవర్:ప్రముఖ సినీ నటుడు అక్కినేని నాగార్జున ఎన్ కన్వెన్షన్ సెంటర్‌ను ప్రభుత్వం తొలగించగా, ఆ తర్వాత ఆయన స్వయంగా స్పందించి చెరువుకు ఆనుకొని ఉన్న రెండు ఎకరాల స్థలాన్ని ప్రభుత్వానికి అప్పగించి నగర అభివృద్ధికి నిజమైన హీరోగా నిలిచారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనియాడారు.

శనివారం నాడు పీజేఆర్ ఫ్లైఓవర్‌ను ప్రారంభించిన అనంతరం ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ హైదరాబాద్ అభివృద్ధి విషయంలో ఎలాంటి ఆటంకాలనైనా అధిగమిస్తామని, కంచ గచ్చిబౌలి ప్రాంతాన్ని అభివృద్ధి చేసి తీరుతామని స్పష్టం చేశారు. కొన్ని అడ్డంకులు ఎదురవుతున్నా అవి తాత్కాలికమేనని, వాటిని అధిగమించి ముందుకు సాగుతామని ఆయన అన్నారు. కంచ గచ్చిబౌలిలో కొత్త పరిశ్రమల ఏర్పాటు ద్వారా సుమారు 5 లక్షల కొత్త ఉద్యోగాలు అందుబాటులోకి వస్తాయని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా దివంగత నేత పీజేఆర్ సేవలను ముఖ్యమంత్రి స్మరించుకున్నారు. హైదరాబాద్ నగరానికి కృష్ణా, గోదావరి జలాలను తీసుకురావడంలో పీజేఆర్ చేసిన కృషి మరువలేనిదని కొనియాడారు. హైటెక్ సిటీ ఏర్పాటుకు పునాది వేసింది కూడా పీజేఆర్ అని అన్నారు. నేదురుమల్లి జనార్దన్ రెడ్డి శంకుస్థాపన చేయగా, చంద్రబాబు దానిని మరో స్థాయికి తీసుకెళ్లారని గుర్తు చేశారు.

ప్రపంచ నగరాలతో పోటీ

హైదరాబాద్ నగరం న్యూయార్క్, టోక్యో వంటి ప్రపంచ స్థాయి నగరాలతో పోటీపడాలని ఆకాంక్షించారు. 'రైజింగ్ తెలంగాణ-2047' లక్ష్య సాధన కోసం తమ ప్రభుత్వం ఒక యజ్ఞంలా పనిచేస్తోందని, దీనికి ఎంతమంది రాక్షసులు అడ్డుపడినా వెనుకాడేది లేదని ఆయన అన్నారు. ఈ లక్ష్య సాధనలో అందరూ కలిసిరావాలని పిలుపునిచ్చారు.

భవిష్యత్ ప్రణాళికలు.. కాలుష్య నియంత్రణ

భవిష్యత్ హైదరాబాద్ కోసం తమ ప్రభుత్వం స్పష్టమైన ప్రణాళికతో ఉందని రేవంత్ రెడ్డి వివరించారు. ఢిల్లీలో కాలుష్యం, చెన్నైలో వరదలు, బెంగళూరులో ట్రాఫిక్ సమస్యల నుంచి పాఠాలు నేర్చుకొని హైదరాబాద్‌ను తీర్చిదిద్దుతామని అన్నారు. ఇందులో భాగంగా నగరంలో కాలుష్యాన్ని తగ్గించేందుకు డీజిల్ బస్సుల స్థానంలో 3 వేల ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెడతామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ, ఎలక్ట్రిక్ వాహనాలు కొనుగోలు చేసే వారికి పన్ను మినహాయింపు ఇస్తున్నట్లు పేర్కొన్నారు.

నగరంలో వరద ముంపునకు నాలాలు, చెరువుల కబ్జాలే ప్రధాన కారణమని ముఖ్యమంత్రి విమర్శించారు. బతుకమ్మకుంటను కొందరు బీఆర్ఎస్ నేతలు కబ్జా చేస్తే తమ ప్రభుత్వం దానిని విడిపించిందని గుర్తు చేశారు.

వివరాలు 2లో..

తెలంగాణ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు తప్పిన ప్రమాదం

- జగిత్యాల జిల్లాలోని మెట్‌పల్లి మండలంలో తప్పిన ప్రమాదం
- మంత్రి కారును ఢీకొట్టిన మరో కారు
- ఊడిపోయిన కారు టైరు
- మరో కారులో ఇంటికి వెళ్లిన మంత్రి లక్ష్మణ్

హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణ రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ప్రమాదం నుండి త్రుటిలో తప్పించుకున్నారు జగిత్యాల జిల్లాలోని మెట్‌పల్లి మండలం మారుతీ నగర్ వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. జాతీయ రహదారిపై మంత్రి ప్రయాణిస్తుండగా... ఆయన కారును మరో కారు ఢీకొట్టింది. దాంతో ఆయన కారు టైరు ఊడిపోయింది. ఈ ప్రమాదం నుంచి మంత్రి

వివరాలు 2లో..

ఇంటి నెంబరు కోసం రూ.5 వేలు లంచం.. ఏసీబీ వలలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, బిల్ కలెక్టర్

- సుల్తానాబాద్‌లో లంచం తీసుకుంటూ ఇద్దరు మున్సిపల్ ఉద్యోగులు అరెస్ట్
- కొత్త ఇంటికి నంబర్ కేటాయించేందుకు రూ. 5 వేలు డిమాండ్
- బాధితుడి ఫిర్యాదుతో వల పన్ని పట్టుకున్న ఏసీబీ అధికారులు
- అరెస్టయిన వారిలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, బిల్ కలెక్టర్
- లంచం అడిగితే 1064కు ఫోన్ చేయాలని ప్రజలకు ఏసీబీ విజ్ఞప్తి
- ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచుతామని స్పష్టీకరణ

వివరాలు 2లో..

జర్నలిస్టులను చంపేస్తారా? అవసరమైతే కేటీఆర్ ఇంటికి వెళతా!

- నిరసనకు రాళ్లు, రాడ్లు ఎందుకని ప్రశ్నించిన 'మహాన్యూస్' వంశీ
- మహాన్యూస్ తప్పు చేసి ఉంటే క్షమాపణ చెప్పేందుకు సిద్ధమని వ్యాఖ్య
- కానీ దాడుల సంస్కృతి ఏమిటని నిలదీత
- నరికేస్తాం, చంపేస్తామని బెదిరించడం ఏమిటని ఆగ్రహం

హైదరాబాద్ పెన్ పవర్: హైదరాబాద్‌లోని మహా న్యూస్ ఛానల్ ప్రధాన కార్యాల యంపై బీఆర్ఎస్ వర్గీయులు దాడి చేశా రంటూ ఛానల్ ఎండీ వంశీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ దాడిని ఖండించారు. నిరసన వ్యక్తం చేయాలనుకుంటే రాళ్లు, రాడ్లు వంటి ఆయుధాలు ఎందుకు తెచ్చారని ఆయన ప్రశ్నించారు. శాంతియుతంగా

వివరాలు 2లో..

నిజాలు బయటపడుతుంటే ట్యాపింగ్ దొంగలకు భయం పట్టుకుంది... మహా న్యూస్ కు బీఆర్ఎస్ క్షమాపణ చెప్పాలి

- మహా న్యూస్ కార్యాలయంపై దాడిని ఖండించిన ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల
- ఇది బీఆర్ఎస్ గూండాల పనేనని తీవ్ర ఆరోపణ
- గతంలో తన ఫోన్‌ను కూడా ట్యాప్ చేశారని వెల్లడి
- ట్యాప్ చేసిన ఆడియోను వైవీ సుబ్బారెడ్డి తనకు వినిపించారని వ్యాఖ్య
- నిజాలు బయటపడుతున్నాయనే భయంతోనే దాడులని విమర్శ
- బీఆర్ఎస్ పార్టీ వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్

వివరాలు 2లో..

మహా న్యూస్ ఛానెల్ కార్యాలయంపై దాడి.. పలువురికి గాయాలు..

హైదరాబాద్ పెన్ పవర్: హైదరాబాద్‌లోని మహా న్యూస్ ఛానెల్ ప్రధాన కార్యాలయంపై చోటు చేసుకున్న దాడి గర్హనీయం. మీడియాలో ప్రసారమయ్యే, ప్రచురితమయ్యే వార్తలు, కథనాలపై అభ్యంతరాలు ఉంటే తెలియచేసే విధానం ఒకటి ఉంటుంది. ఇందుకు భిన్నంగా దాడులకు పాల్పడటం సమంజసం కాదు. మహా న్యూస్ ఛానెల్ పై జరిగిన దాడిని ప్రజాస్వామ్యవాదులు తప్పనిసరిగా ఖండించాలి. ఈ దాడికి కారకులైనవారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాను.

వివరాల్లోకి వెళితే..

హైదరాబాద్‌లోని జూబ్లీ హిల్స్‌లో ఉన్న మహా న్యూస్ ఛానెల్ ప్రధాన కార్యాలయంపై జూన్ 28, 2025న మధ్యాహ్నం 2:00 గంటల సమయంలో ఈ దాడి జరిగింది

దాడి కారణం:

సోషల్ మీడియా పోస్టుల ప్రకారం, మహా న్యూస్ ఛానెల్‌లో ప్రసారమైన కొన్ని కథనాలు,

వివరాలు 2లో..

పాకిస్థాన్ లో ఆత్మాహుతి దాడి... 16 మంది సైనికుల మృతి

- ఉత్తర వజీరిస్థాన్‌లో సైనిక కాన్వాయ్‌పై ఆత్మాహుతి దాడి
- ఘటనలో 16 మంది పాక్ సైనికులు దుర్మరణం
- 24 మందికి పైగా గాయాలు, వారిలో పౌరులు కూడా
- పేలుడు ధాటికి రెండు ఇళ్ల పైకప్పులు కూలి ఆరుగురు చిన్నారులకు గాయాలు
- తామే దాడికి పాల్పడినట్టు ప్రకటించిన పాకిస్థానీ తాలిబన్లు
- ఆఫ్ఘన్‌లో తాలిబన్ల పాలన తర్వాత పాక్‌లో పెరిగిన హింస

హైదరాబాద్ పెన్ పవర్:పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావి న్స్‌లో మరోసారి నెత్తురు చిందింది. ఉత్తర వజీరిస్థాన్ జిల్లాలో సైనిక కాన్వాయ్‌ను లక్ష్యంగా చేసుకుని పాకిస్థానీ తాలిబన్లు జరిపిన ఆత్మాహుతి దాడిలో 16 మంది సైనికులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలో పౌరులతో సహా మరో 24 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. శనివారం జరిగిన

వివరాలు 2లో..

డిజిటల్ అరెస్ట్ పేరుతో లేడీ డాక్టర్ కు టోకరా... రూ.3 కోట్లు వసూలు!

- ముంబైలో 70 ఏళ్ల వృద్ధ వైద్యురాలికి భారీ సైబర్ మోసం
- డిజిటల్ అరెస్ట్ పేరుతో 8 రోజుల పాటు వర్చువల్ నిర్బంధం
- మనీలాండరింగ్ కేసులో ఇరికిస్తామని నకిలీ ఐపీఎస్ అధికారి బెదిరింపు
- భయపెట్టి విడతలవారీగా రూ.3 కోట్లకు పైగా నగదు బదిలీ
- పోలీసుల దర్యాప్తులో రూ.82 లక్షలు క్రిప్టోలోకి మార్చినట్లు గుర్తింపు
- డిజిటల్ అరెస్ట్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన

హైదరాబాద్ పెన్ పవర్:సైబర్ నేరగాళ్లు రోజుకో కొత్త పంథాలో అమాయకుల ను మోసగిస్తున్నారు. తాజాగా 'డిజిటల్ అరెస్ట్' పేరుతో సాగుతున్న మోసాలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. చట్టం, పోలీసులంటే ఉండే భయాన్ని ఆసరాగా చేసుకుని, ప్రముఖ కేసుల్లో ప్రమేయం ఉందంటూ బెదిరించి భారీగా డబ్బులు దండుకుంటున్నారు. ఈ తరహా మోసానికి

వివరాలు 2లో..

అంతరిక్షంలో 'భారత్ మాతా కీ జై'.. శుభాంశు శుక్లాతో మాట్లాడిన ప్రధాని మోదీ!

- అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలోకి ప్రవేశించిన తొలి భారతీయుడిగా శుభాంశు శుక్లా
- శుక్లాతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడిన ప్రధాని నరేంద్ర మోదీ
- భారత మానవసహిత యాత్ర గగన్‌యాన్‌కు ఇది తొలి అడుగు అని పేర్కొన్న ప్రధాని
- అంతరిక్షం నుంచి చూస్తే భూమిపై సరిహద్దులే కనిపించవన్న శుక్లా

హైదరాబాద్ పెన్ పవర్: భారత అంతరిక్ష రంగంలో ఒక నూతన అధ్యాయం ఆరంభమైంది. భారత వాయుసేన గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లోకి అడుగుపెట్టిన తొలి భారతీయుడిగా చరిత్ర సృష్టించారు. ఈ చారిత్రాత్మక సందర్భంలో ప్రధాని నరేంద్ర మోదీ శనివారం నాడు శుక్లాతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఈ సంభాషణలో భాగంగా శుక్లా 'భారత్ మాతా కీ జై' అని నినదించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. శుభాంశు శుక్లా ప్రయాణం దేశ ప్రతిష్ఠను మరింత పెంచిందని కొనియాడారు. "మీరు మిషన్ కోసం భౌతికంగా దేశానికి దూరంగా ఉన్నప్పటికీ, 140 కోట్ల మంది భారతీయుల హృదయాలకు చాలా దగ్గరగా ఉన్నారు. మీ ఈ చారిత్రక యాత్ర ఒక నూతన శకానికి

వివరాలు 2లో..

ఎడిటర్ వ్యూ

సన్యాసమే చివరకు?

వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో నారాయణ స్వామి యాక్టివ్ గా ఉన్నారు. మంత్రిగా ఐదేళ్ల పాటు కొనసాగారు. అయితే ఎక్సైజ్ శాఖ మంత్రిగా వ్యవహరించిన నారాయణస్వామి మద్యం స్కామ్ కేసు విచారణ జరుగుతున్న సమయంలో ఆయన పత్తా లేకుండా పోయారు. అసలు పార్టీలో ఆయన ఉన్నారా? లేదా? అన్న అనుమానం కలుగుతుంది. నారాయణస్వామి మంత్రిగా ఉన్నప్పుడు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు తో పాటు లోకేశ్ మిగిలిన కీలక నేతలందరిపై విమర్శలు చేస్తూ వచ్చే వారు. జగన్ మంత్రివర్గంలో నారాయణస్వామి ఐదేళ్ల పాటు కొనసాగడానికి వెనక కూడా ఆయన సామాజికవర్గంతో పాటు చిత్తూరు జిల్లాలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి సన్నిహితుడిగా ఉండటమే కారణం.

ఐదేళ్లు మంత్రిగానే...

కళత్తూరు నారాయణ స్వామి కాంగ్రెస్ పార్టీలో రాజకీయాల్లోకి వచ్చార. 1994, 1999లో సత్యవేడు నియోజకవర్గం నుండి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమిపాలయ్యారు. 2004లో తొలిసారి అసెంబ్లీకి ఎన్నికయ్యారు. ఆయన 2009లో సత్యవేడు నియోజకవర్గం నుండి ఓడిపోయారు.. 2014, 2019 శాసనసభ ఎన్నికల్లో గంగాధరనెల్లూరు నియోజకవర్గం నుండి ఎమ్మెల్యేగా గెలిచారు. 2019లో అధికారంలోకి వచ్చిన తర్వాత వై.ఎస్. జగన్ మంత్రివర్గంలో 2019 జూన్ 8న ఉప ముఖ్యమంత్రిగా, ఎక్సైజ్, కమర్షియల్ ట్యాక్స్ శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఐదేళ్ల పాటు ఉప ముఖ్యమంత్రిగా వ్యవహరించారంటే జగన్ ఆయనకు ఎంత ప్రాధాన్యత ఇచ్చారో అర్థమవుతుంది.

పోటీ చేయకుండానే...

నాడు చంద్రబాబుపై విరుచుకుపడిన నారాయణస్వామి గత ఏడాది నుంచి పత్తా లేకుండా పోయారు. తాజాగా తిరుపతిలో జరిగిన వైసీపీ కార్యక్రమంలో కనిపించారు. కానీ పెద్దగా యాక్టివ్ గా లేరు అయితే 2024 ఎన్నికల్లో నారాయణస్వామికి చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గంలో పోటీ చేయాలని పార్టీ నాయకత్వం కోరినప్పటికీ అందుకు ఆయన అంగీకరించలేదు. గంగాధర నెల్లూరు నియోజకవర్గంలో ఆయన కుమార్తెకు టిక్కెట్ ఇచ్చారు. గంగాధర నెల్లూరు నియోజకవర్గం వైసీపీ నేతలు నారాయణస్వామికి టిక్కెట్ ఇవ్వవద్దంటూ గట్టిగా పట్టుబట్టడంతో జగన్ ఆయనను పక్కన పెట్టారు. అయినా కుమార్తెకు టిక్కెట్ ఇవ్వడంతో కొంత శాంతించిన నారాయణస్వామి ఆమె గెలుపు కోసం పనిచేసినాఫలితం లేకుండా పోయింది. తెలుగుదేశం పార్టీ అభ్యర్థిని విజయం వరించింది.

లిక్కర్ స్కాం పై విచారణ జరుగుతున్న సమయంలో...

అయితే ఆంధ్రప్రదేశ్ లో లిక్కర్ స్కామ్ పై విచారణ జరుగుతున్న సందర్భంగా నారాయణస్వామి మౌనంగా ఉండటం ఇప్పుడు చర్చనీయాంశమైంది. అయితే నారాయణస్వామి ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత అమెరికాలో ఉంటున్న తన కుమార్తె వద్దకు వెళ్లి వచ్చారని, నియోజకవర్గం క్యాడర్ కు కూడా దూరంగా ఉంటున్నారని చెబుతున్నారు. లిక్కర్ స్కామ్ విచారణ జరుగుతున్న సమయంలో ఐదేళ్ల పాటు ఆ శాఖకు మంత్రిగా వ్యవహరించిన నారాయణస్వామి మౌనం ఇప్పుడు అధికార పార్టీకి వరంగా మారింది. అయితే ఇక నారాయణ స్వామి రాజకీయాల నుంచితప్పుకునే ఛాన్స్ ఉందంటున్నారు. రాజకీయ సన్యాసం వైపు స్వామి అడుగులు వేస్తున్నారన్న టాక్ బలంగా వినిపిస్తుంది.

తెలంగాణ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు తప్పిన ప్రమాదం

- మొదటి పేజి తరువాయి

సురక్షితంగా బయటపడ్డారు. ఈ ఘటనలో కారు స్వల్పంగా దెబ్బతింది. కారు ప్రమాదానికి గురికావడంతో ఆయన మరో వాహనంలో తన నివాసానికి చేరుకున్నారు.ఆయన కొద్ది రోజుల క్రితమే మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన మంత్రివర్గాన్ని విస్తరించిన క్రమంలో ముగ్గురికి అవకాశం లభించగా, వారిలో అడ్లూరి లక్ష్మణ్ ఒకరు. గత అసెంబ్లీ ఎన్నికల్లో అడ్లూరి లక్ష్మణ్ ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి గెలుపొందారు.

దొంగలకు భయం పట్టుకుంది... మహా న్యూస్ కు బీఆర్ఎస్ క్షమాపణ చెప్పాలి

తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై వార్తలు ప్రసారం చేస్తున్న మహా న్యూస్ ప్రధాన కార్యాలయంపై దాడికి పాల్పడడాన్ని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రంగా ఖండించారు. వాస్తవాలను వెలికితీస్తున్న మీడియా సంస్థపై భౌతిక దాడులకు దిగడం అప్రజాస్వామికమని ఆమె అన్నారు. "తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ పై వాస్తవాలను ప్రసారం చేస్తున్న మహా న్యూస్ ప్రధాన కార్యాలయంపై, బీఆర్ఎస్ గూండాల దాడిని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ తీవ్రంగా ఖండిస్తోంది. ఛానెల్ లో పనిచేసే సిబ్బందిపై, ముఖ్యంగా మహిళా జర్నలిస్టుల మీద దాడి హేయమైన చర్య. ఇలాంటి దాడులు మీడియా స్వేచ్ఛకు భంగం కలిగించడంతో పాటు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తాయి. నా ఫోన్ ట్యాప్ చేశారు. ట్యాప్ చేసిన ఆడియోనే వైవీ సుబ్బారెడ్డి గారు నాకు వినిపించారు. ఉన్నమాట అంటే ఉలుకెక్కువ అన్నట్లు... ఫోన్ ట్యాపింగ్ విషయంలో మీ దొంగ చెవులను పసిగడుతుంటే దాడులకు దిగుతారా? వాస్తవాలు చెప్పే వాళ్లను చంపాలని చూస్తారా? అధికారాన్ని అడ్డుపెట్టుకొని ఎవరి ఫోన్లనైనా ట్యాప్ చేయవచ్చా? అడిగినోళ్లకు సైతం ట్యాప్ చేసిన కాల్ రికార్డ్స్ పంపవచ్చా? దొంగతనంగా ఫోన్లు ట్యాప్ చేసి నీచానికి ఒడిగడతారా? తీగ లాగుతుంటే డొంక కదులుతుంది అన్నట్లు సిట్ విచారణలో నిజాలన్నీ బయట పడుతుంటే, ట్యాపింగ్ దొంగలకు భయం పట్టుకుంది. తక్షణమే మహా న్యూస్ యాజమాన్యానికి బీఆర్ఎస్ పార్టీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తున్నాం" అని షర్మిల స్పష్టం చేశారు.

ఆన్ లైన్ మోసాలు పెరిగాయి... ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- మొదటి పేజి తరువాయి

పరిరక్షణకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ప్రతి వీధి, ప్రతి గ్రామాన్ని సీసీ కెమెరాల నిఘా నీడలోకి తీసుకురావడమే మా లక్ష్యం. టెక్నాలజీ వినియోగంలో ఎన్టీఆర్ జిల్లా కమిషనరేట్ ముందుండటం అభినందనీయం" అని ఆమె అన్నారు. నేర నియంత్రణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని, వాటి ఏర్పాటుతో రాష్ట్రవ్యాప్తంగా నేరాల సంఖ్య గణనీయంగా తగ్గిందని పేర్కొన్నారు.

ప్రార్థనా మందిరాలకు 'సురక్షా' కవచం

ఈ కార్యక్రమంలో భాగంగా, జిల్లాలోని ఆలయాలు, చర్చిలు, మసీదుల భద్రత కోసం ప్రత్యేకంగా రూపొందించిన 28 'సురక్షా డివైస్ కిట్ల'ను మంత్రి పంపిణీ చేశారు. ఈ పరికరాల ద్వారా ప్రార్థనా మందిరాల వద్ద నిరంతర పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్‌బాబు మాట్లాడుతూ, "ప్రజల భాగస్వామ్యంతోనే నేరరహిత సమాజం సాధ్యం. 'సురక్షా 360' కార్యక్రమం ద్వారా కమ్యూనిటీ పోలీసింగ్‌ను బలోపేతం చేసి, ప్రతి పౌరుడికి భద్రతాభావం కల్పిస్తాం" అని భరోసా ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), ఎమ్మెల్యేలు సుజనాచౌదరి, గద్దె రామ్మోహన్, బొండా ఉమామహేశ్వరరావు, ఇతర ప్రజాప్రతినిధులు, పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మహా న్యూస్ ఛానెల్ కార్యాలయంపై దాడి.. పలువురికి గాయాలు..

- మొదటి పేజి తరువాయి

ముఖ్యంగా ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో భారత రాష్ట్ర సమితి (%దీ=ూ%) నాయకుడు కేటీఆర్‌పై తప్పుడు కథనాలు ప్రసారం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ కథనాలు, థంబ్‌నెయిల్స్ %దీ=ూ% కార్యకర్తలలో ఆగ్రహానికి కారణమయ్యాయని చెబుతున్నారు. అయితే %దీ=ూ% కార్యకర్తలు మహా న్యూస్ కార్యాలయంపై దాడి చేసి, కార్యాలయ అద్దాలు, పలు కార్లను ధ్వంసం చేశారు. కొందరు కార్యకర్తలు ఆఫీసు లోపలికి కూడా ప్రవేశించి ఆందోళన వ్యక్తం చేశారు.ఈ దాడి సమయంలో నటుడు సుహాస్ తన చిత్రం 'ఉప్పు కప్పురంబు' ప్రమోషన్ కోసం మహా న్యూస్‌కి ఇంటర్వ్యూ ఇవ్వడానికి వచ్చారు. దాడి కారణంగా ఆయన ఆందోళనకు గురై, వెంటనే అక్కడి నుండి వెళ్లిపోయారు. %దీ=ూ% విద్యార్థి విభాగం నాయకులు శాంతియుతంగా నిరసన తెలపడానికి వచ్చినప్పటికీ, మహా న్యూస్ సిబ్బంది దాడి చేయడంతో పరిస్థితి ఉద్రిక్తమైందని, దీంతో %దీ=ూఎ% నాయకులు తిరిగి దాడి చేశారని కొన్ని పోస్టులు పేర్కొన్నాయి. ఈ ఘటనలో కొందరు %దీ=ూఎ% నాయకులు గాయపడినట్లు తెలుస్తోంది.అయితే ఈ దాడిని పలువురు తీవ్రంగా ఖండించారు. జనసేన పార్టీ, ఇతర వ్యక్తులు ఈ దాడిని ప్రజాస్వామ్య విరుద్ధంగా పేర్కొన్నారు. మీడియాపై అభ్యంతరాలు ఉంటే, చట్టపరమైన మార్గాల ద్వారా నిరసన తెలపాలని, దాడులు సమంజసం కాదని సూచించారు. మీడియా గొంతును నొక్కే ఇలాంటి ప్రయత్నాలను సహించరాదని పేర్కొన్నారు. అంతేకాకుండా దాడికి కారకులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పలువురు సోషల్ మీడియా ద్వారా తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు.ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం లేదా పోలీసు శాఖ నుండి ఈ దాడి గురించి అధికారిక ప్రకటన లేదా చర్యలకు సంబంధించిన వివరాలు వెల్లడి కాలేదు. అయితే, ఈ ఘటనపై తెలంగాణ ప్రభుత్వం తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పవన్ కళ్యాణ్ విజ్ఞప్తి చేశారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు మళ్లీ జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వం ఉందని పవన్ కళ్యాణ్ తెలిపారు.ఏపీ సీఎం చంద్రబాబు ఈ ఘటనపై సోషల్ మీడియా ఫ్లాట్ ఫాం ట్విట్టర్లో స్పందించారు. ' హైదరాబాద్ మహా టీవీ హెడ్ ఆఫీసుపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాను. ప్రజావాణి వినిపించే మీడియాపై దాడి ప్రజాస్వామ్యంపై దాడిగానే పరిగణించాలి. మహా టీవీపై దాడి చేసినవారిపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరుతున్నాను. కథనాలు,ప్రసారాల పట్ల అభ్యంతరాలు ఉంటే, తెలియజేయవచ్చు. వివరణ కోరవచ్చు, ఖండన అడగవచ్చు. ఇటువంటి దాడులు క్షమార్హం కాదు. మహా యాజమాన్యానికి సంఘీభావం తెలుపుతున్నాను.' అని చంద్రబాబు అన్నారు.ఇక, మంత్రి నారా లోకేష్ కూడా మహాన్యూస్ పై దాడిని ఖండించారు. 'తెలుగు రాష్ట్రాల్లో ప్రముఖ మీడియా ఛానల్ మహా న్యూస్ ప్రధాన కార్యాలయంపై జరిగిన దాడిని ఖండిస్తున్నాను. హైదరాబాద్ లోని ఛానల్ కార్యాలయంపై దుండగులు దాడి చేసి విధ్వంసం సృష్టించడం దారుణం. ప్రజాస్వామ్యంలో ఇలాంటి దాడులకు చోటు లేదు. బెదిరింపులు, దాడులతో మీడియాను కట్టడి చేయాలనే ఆలోచన మంచిది కాదు. ప్రజలు, సమాజం దీన్ని ఆమోదించరు. మహా న్యూస్ యాజమాన్యానికి, సిబ్బందికి, జర్నలిస్టులకు సంఘీభావం తెలుపుతున్నాను.' అని లోకేష్ అన్నారు.

మీడియా సంస్థలపై కేటీఆర్ ఫైర్.. చట్టపరమైన చర్యలకు సిద్ధం

- మొదటి పేజి తరువాయి

వల్ల తన కుటుంబ సభ్యులు, స్నేహితులు, పార్టీ సహచరులు మానసికంగా వేదనకు గురవుతున్నారని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కారణంగానే తాను చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నిర్ణయించుకున్నానని ఆయన తెలిపారు. ఇలాంటి రాతలు రాస్తున్న ప్రతి ఒక్కరిపై కేసులు పెడతానని ఆయన హెచ్చరించారు. ఈ దాడుల వెనుక ఎవరున్నారనే విషయంపై కూడా కేటీఆర్ స్పందించారు. "ఈ వ్యవస్థీకృత దాడుల వెనుక ఎవరున్నారో నాకు తెలుసు. వారిని కూడా తగిన విధంగా ఎదుర్కొంటాను" అని ఆయన స్పష్టం చేశారు.

ప్రజాస్వామ్యంలో భౌతిక దాడికి ఆస్కారం లేదు

మహా న్యూస్ ఛానల్ కార్యాలయంపై దాడి ఘటన నేపథ్యంలో కేటీఆర్ స్పందిస్తూ, ప్రజాస్వామ్యంలో భౌతిక దాడులకు ఆస్కారం లేదని అన్నారు.

'ఎన్ కన్వెన్షన్' తొలగించాక నాగార్జున ప్రభుత్వానికి 2 ఎకరాలు అప్పగించారు!

- మొదటి పేజి తరువాయి

కేవలం అక్రమ నిర్మాణాలను మాత్రమే 'హైడ్రా' ద్వారా కూల్చివేసినట్లు స్పష్టం చేశారు.

భారత్ ఫ్యూచర్ సిటీ.. నియోజకవర్గాల పునర్విభజన

హైదరాబాద్‌పై పెరుగుతున్న ఒత్తిడిని తగ్గించేందుకే 30 వేల ఎకరాల్లో 'భారత్ ఫ్యూచర్ సిటీ'ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. 2029లో జరగబోయే నియోజకవర్గాల పునర్విభజనలో శేరిలింగంపల్లి వంటి పెద్ద నియోజకవర్గాలు నాలుగుగా విడిపోయే అవకాశం ఉందని, దీనివల్ల అందరికీ అభివృద్ధిలో భాగస్వామ్యం లభిస్తుందని సీఎం వివరించారు.

ఇంటి నెంబరు కోసం రూ.5 వేలు లంచం.. ఏసీబీ వలలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, బిల్ కలెక్టర్

ప్రభుత్వ కార్యాలయాల్లో లంచం తీసుకునే అధికారులపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) ఉక్కుపాదం మోపుతోంది. తాజాగా పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ పురపాలక సంఘంలో లంచం తీసుకుంటున్న ఇద్దరు ఉద్యోగులను ఏసీబీ అధికారులు శుక్రవారం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కొత్తగా నిర్మించిన ఇంటికి నంబర్ కేటాయించేందుకు ఓ పౌరుడి నుంచి రూ. 5,000 లంచం స్వీకరిస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది.

వివరాల్లోకి వెళితే..

సుల్తానాబాద్‌కు చెందిన ఒక వ్యక్తి తాను కొత్తగా నిర్మించుకున్న ఇంటికి నంబర్ కేటాయించాలని కోరుతూ స్థానిక పురపాలక కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. ఈ ప్రక్రియను వేగవంతం చేసేందుకు కార్యాలయంలోని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అనపర్తి వినోద్ కుమార్, బిల్ కలెక్టర్ నాంపల్లి విజయ్ కుమార్ రూ. 5,000 లంచం డిమాండ్ చేశారు. లంచం ఇవ్వడం ఇష్టం లేని ఆ వ్యక్తి నేరుగా తెలంగాణ ఏసీబీ అధికారులను ఆశ్రయించారు.

బాధితుడి ఫిర్యాదు స్వీకరించిన ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో రంగంలోకి దిగారు. ముందుగా అనుకున్న ప్రకారం, ఫిర్యాదుదారుడు శుక్రవారం నాడు కార్యాలయంలో వినోద్ కుమార్, విజయ్ కుమార్‌లకు రూ. 5,000 ఇస్తుండగా.. అక్కడే మాటువేసిన ఏసీబీ బృందం వారిని అదుపులోకి తీసుకుంది. లంచం డబ్బును స్వాధీనం చేసుకుని, ఇద్దరు ఉద్యోగులను అరెస్ట్ చేసినట్లు అధికారులు తెలిపారు.

లంచం అడిగితే ఫిర్యాదు చేయండి: ఏసీబీ

ఈ సందర్భంగా ఏసీబీ అధికారులు ప్రజలకు కీలక సూచనలు చేశారు. ఏ ప్రభుత్వ ఉద్యోగి అయినా సేవలు అందించడానికి లంచం అడిగితే ఏమాత్రం భయపడకుండా తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఫిర్యాదు చేసేందుకు టోల్ ఫ్రీ నంబర్ 1064కు ఫోన్ చేయాలని సూచించారు. అంతేకాకుండా వాట్సాప్ నంబర్ 9440446106 ద్వారా గానీ, ఫేస్‌బుక్ (Telangana ACB%), ఎక్స్ (TelanganaACB) వంటి సామాజిక మాధ్యమాల ద్వారా గానీ, అధికారిక వెబ్‌సైట్ ద్వారా గానీ సంప్రదించవచ్చని తెలిపారు. లంచంపై ఫిర్యాదు చేసిన వారి వివరాలను అత్యంత గోప్యంగా ఉంచుతామని అధికారులు భరోసా ఇచ్చారు.

పాకిస్థాన్ లో ఆత్మాహుతి దాడి... 16 మంది సైనికుల మృతి

- మొదటి పేజి తరువాయి

ఈ సంఘటన దేశవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది.స్థానిక ప్రభుత్వ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, ఒక ఆత్మాహుతి దళ సభ్యుడు పేలుడు పదార్థాలతో నింపిన వాహనాన్ని వేగంగా నడుపుకుంటూ వచ్చి సైనిక కాన్వాయ్‌ను ఢీకొట్టాడు. దీంతో భారీ పేలుడు సంభవించి సైనికులు ప్రయాణిస్తున్న వాహనాలు ధ్వంసమయ్యాయి. పేలుడు తీవ్రతకు సమీపంలోని రెండు ఇళ్ల పైకప్పులు కూలిపోయాయని, ఫలితంగా ఆరుగురు చిన్నారులు గాయపడ్డారని జిల్లాలోని ఒక పోలీస్ అధికారి వెల్లడించారు. మొదట మృతుల సంఖ్య 13గా ఉన్నప్పటికీ, ఆ తర్వాత 16కి పెరిగినట్టు అధికారులు ధ్రువీకరించారు.ఈ ఆత్మాహుతి దాడికి తామే బాధ్యత వహిస్తున్నట్టు పాకిస్థానీ తాలిబన్‌కు చెందిన హాఫీజ్ గుల్ బహదూర్ గ్రూప్ ప్రకటించుకుంది. 2021లో ఆఫ్ఘనిస్థాన్‌లో తాలిబన్లు తిరిగి అధికారం చేపట్టినప్పటి నుంచి పాక్ సరిహద్దు ప్రాంతాల్లో హింసాత్మక ఘటనలు గణనీయంగా పెరిగాయి. తమ భూభాగం నుంచి ఉగ్రవాదులు దాడులకు పాల్పడుతున్నారని పాకిస్థాన్ పదేపదే ఆఫ్ఘనిస్థాన్‌పై ఆరోపణలు చేస్తోంది. అయితే, ఈ ఆరోపణలను కాబూల్‌లోని తాలిబన్ ప్రభుత్వం ఖండిస్తూ వస్తోంది.ఈ ఏడాది ప్రారంభం నుంచి ఖైబర్ పఖ్తుంఖ్వా, బలూచిస్థాన్ ప్రావిన్సులలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా సాయుధ గ్రూపులు జరిపిన దాడుల్లో సుమారు 290 మంది మరణించారని, వీరిలో అత్యధికులు భద్రతా సిబ్బందేనని ఏఎఫ్‌పీ వార్తా సంస్థ గణాంకాలు చెబుతున్నాయి. తాజా ఘటనతో సరిహద్దు ప్రాంతాల్లో భద్రతాపరమైన ఆందోళనలు మరింత తీవ్రమయ్యాయి.

డిజిటల్ అరెస్ట్ పేరుతో లేడీ డాక్టర్ కు టోకరా... రూ.3 కోట్లు వసూలు!

- మొదటి పేజి తరువాయి

గురైన ముంబైకి చెందిన 70 ఏళ్ల వైద్యురాలు ఏకంగా రూ.3 కోట్లు పోగొట్టుకున్నారు. నేరగాళ్లు ఆమెను 8 రోజుల పాటు డిజిటల్ మాధ్యమంలో నిర్బంధించి ఈ దారుణానికి పాల్పడ్డారు.

అసలేం జరిగిందంటే...!

ముంబైలో నివసిస్తున్న 70 ఏళ్ల వైద్యురాలికి మే 28న అమిత్ కుమార్ అనే వ్యక్తి నుంచి ఫోన్ కాల్ వచ్చింది. తాను టెలికాం డిపార్ట్‌మెంట్ నుంచి మాట్లాడుతున్నానని పరిచయం చేసుకున్న ఆ వ్యక్తి, "మీ ఆధార్ కార్డు ఉపయోగించి గుర్తుతెలియని వ్యక్తులు కొత్త సిమ్ కార్డు తీసుకున్నారు. ఆ సిమ్ కార్డు వినియోగదారుడిపై ఇప్పటికే కేసు నమోదైంది" అని చెప్పి ఆమెలో ఆందోళన రేకెత్తించాడు. ఆ తర్వాత కొద్దిసేపటికే, ముంబై సైబర్ క్రైమ్ విభాగం పేరుతో ఆమె వాట్సాప్ కు ఒక సందేశం వచ్చింది. కేసు విచారణకు వ్యక్తిగత వివరాలు పంపాలని కోరగా, భయపడిన ఆమె వారు అడిగిన వివరాలన్నీ పంపించారు.

నకిలీ ఐపీఎస్ అధికారి రంగప్రవేశం

కొన్ని రోజుల తర్వాత, అదే వాట్సాప్ నంబర్ నుంచి ఆమెకు మరో కాల్ వచ్చింది. ఈసారి ఫోన్ చేసిన వ్యక్తి, తాను ముంబై క్రైమ్ బ్రాంచ్‌లో పనిచేసే ఐపీఎస్ అధికారి సమర్థన్ పవార్‌ను అంటూ పరిచయం చేసుకున్నాడు. జెట్ ఎయిర్‌వేస్ వ్యవస్థాపకుడు నరేశ్ గోయల్‌కు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఆమె పేరు కూడా ఉందని నమ్మబలికాడు. గోయల్ ఇంట్లో సోదాలు చేస్తుండగా ఆమె పేరు మీద ఉన్న బ్యాంక్ అకౌంట్, డెబిట్ కార్డు దొరికాయని, ఈ కేసులో తీవ్రమైన శిక్ష పడుతుందని బెదిరించాడు. తన మాటలను ఆమె నమ్మేందుకు, కేసుకు సంబంధించినవంటూ కొన్ని నకిలీ పత్రాలను కూడా వాట్సాప్‌లో పంపించాడు.

8 రోజుల డిజిటల్ నిర్బంధం

ఈ పరిణామాలతో తీవ్ర భయాందోళనలకు గురైన బాధితురాలికి, పోలీసు దుస్తుల్లో ఉన్న ఓ వ్యక్తి వీడియో కాల్ చేసి మాట్లాడాడు. మనీలాండరింగ్ కేసు తీవ్రమైనది కావడంతో ఆమెను 'డిజిటల్ అరెస్ట్' చేస్తున్నట్లు ప్రకటించాడు. 8 రోజుల పాటు ఎక్కడికీ వెళ్లకూడదని, ఎవరితోనూ మాట్లాడకూడదని, నిరంతరం తమ పర్యవేక్షణలో ఉండాలని ఆదేశించాడు. విచారణలో భాగంగా ఆమె బ్యాంకు ఖాతాల్లో ఉన్న డబ్బును తాము చెప్పే వేర్వేరు ఖాతాలకు బదిలీ చేయాలని, ఆ డబ్బును పరిశీలించాక తిరిగి పంపుతామని ఒత్తిడి చేశాడు.

కేసు నుంచి బయటపడాలనే ఆందోళనలో ఉన్న ఆ వైద్యురాలు, వారు చెప్పినట్టే విడతలవారీగా దాదాపు రూ.3 కోట్లను వారి ఖాతాలకు బదిలీ చేసింది. 8 రోజుల తర్వాత, కేసు నుంచి విముక్తి కల్పిస్తున్నామని చెప్పి నేరగాళ్లు ఆమెతో సంబంధాలు తెంచుకున్నారు. జరిగిన విషయాన్ని బంధువులకు చెప్పడంతో, ఇది సైబర్ మోసమని వారు అనుమానించారు. వెంటనే బాధితురాలు పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. నిందితులు కాజేసిన సొమ్ములో నుంచి రూ.82 లక్షలను ఇప్పటికే క్రిప్టో కరెన్సీ రూపంలోకి మార్చినట్లు ప్రాథమిక విచారణలో గుర్తించారు. ఈ ముఠా వెనుక ఉన్న సూత్రధారుల కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జర్నలిస్టులను చంపేస్తారా? అవసరమైతే కేటీఆర్ ఇంటికి వెళతా!

- మొదటి పేజి తరువాయి

కార్యాలయం ఎదుట నిరసన తెలిపే అవకాశం ఉన్నప్పటికీ ఇలాంటి దాడులకు పాల్పడటం దుర్మార్గమని అన్నారు. ఒకవేళ మహాన్యూస్ ఏదైనా తప్పు చేసి ఉంటే క్షమాపణ చెప్పడానికి సిద్ధంగా ఉన్నామని ఆయన స్పష్టం చేశారు.ఇలాంటి దాడులను ప్రజలు హర్షిస్తారా? అని ఆయన ప్రశ్నించారు. ఇరవై మందికి పైగా కర్రలు, రాళ్లతో దాడి చేస్తుంటే తమ సిబ్బంది ప్రాణాలకు తెగించి వారిని అడ్డుకునే ప్రయత్నం చేశారని ఆయన తెలిపారు. జర్నలిస్టులపై దాడులు చేస్తే వారి ప్రాణాలకు ఎవరు బాధ్యత వహిస్తారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టులను చంపేస్తారా? సమాజానికి ఏం సందేశం ఇవ్వాలనుకుంటున్నారు? అని ఆయన ప్రశ్నించారు. ఈ దాడి మంచి చేస్తుందా, చెడు చేస్తుందా అని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆలోచించాలని సూచించారు. కొందరు ఈ దాడికి మద్దతు పలుకుతున్నారని, ఇలాంటి ఘటనలు ఎదురైతే వారిని ఎవరు కాపాడుతారని ఆయన ప్రశ్నించారు. ఈ దాడిపై మహాన్యూస్ తప్పకుండా పోరాటం చేస్తుందని ఆయన స్పష్టం చేశారు.దాడి చేసింది బీఆర్ఎస్ కార్యకర్తలు, కేటీఆర్ అనుచరులని అర్థమవుతోందని వంశీ అన్నారు. ఫోన్ ట్యాపింగ్ గురించి, తమ నాయకుడి గురించి ఎందుకు మాట్లాడుతున్నారని దాడి చేసిన వారు నినాదాలు చేశారని ఆయన తెలిపారు. నరికేస్తాం, చంపేస్తాం, పొడిచేస్తామని బెదిరించారని ఆయన వాపోయారు. కేసీఆర్ నాయకత్వంలోని పార్టీలో ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడటం ఏమిటని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాజాన్ని ఎటువైపు తీసుకువెళుతున్నారని ప్రశ్నించారు.మేము ఏదైనా తప్పు చేసి ఉంటే నిలదీయవచ్చని వంశీ అన్నారు. అవసరమైతే తాను కేటీఆర్ ఇంటికి వెళతానని లేదా కేటీఆర్ తన స్టూడియోకు రావొచ్చని ఆయన పేర్కొన్నారు. ఈ దాడి ఘటనలో కొంతమందిని పోలీసులు అరెస్టు చేసినట్లు తెలుస్తోందని, పోలీసు విచారణపై తనకు పూర్తి విశ్వాసం

ఉందని ఆయన అన్నారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై కేసీఆర్ మాట్లాడితే బాగుంటుందని ఓ జర్నలిస్టుగా తాను కోరుకోవడంలో తప్పేమిటని ఆయన ప్రశ్నించారు. ఈ దాడిపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆయన కోరారు. మీడియాపై దాడులు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

అంతరిక్షంలో 'భారత్ మాతా కీ జై'.. శుభాంశు శుక్లాతో మాట్లాడిన ప్రధాని మోదీ!

- మొదటి పేజి తరువాయి

నాంది పలుకుతుంది. ఇది మన దేశ మానవసహిత అంతరిక్ష యాత్ర 'గగన్‌యాన్'కు మొదటి అడుగు వంటిది. అంతరిక్షాన్ని అన్వేషించాలనే భారత విద్యార్థుల ఆకాంక్షలకు మీ విజయం మరింత బలాన్నిస్తుంది" అని శుక్లాను ఉద్దేశించి ప్రధాని అన్నారు. ఈ ప్రయాణం వికసిత భారత్ లక్ష్యానికి నూతన ఉత్తేజాన్ని అందిస్తుందని ఆయన పేర్కొన్నారు.

ప్రధాని ప్రశంసలకు శుభాంశు శుక్లా వినమ్రంగా స్పందించారు. ఇది తన ఒక్కడి విజయం కాదని, యావత్ భారతదేశం సాధించిన సమష్టి విజయమని అన్నారు. "భారత్‌కు ప్రాతినిధ్యం వహించడం నాకు గర్వకారణంగా ఉంది. ఇక్కడి నుంచి మన దేశాన్ని మొదటిసారి చూసినప్పుడు, మ్యాప్‌లో చూసిన దానికంటే ఎంతో పెద్దదిగా, మహోన్నతంగా కనిపించింది. ఈ భూమి అంతా ఒకే ఇల్లు, మనమంతా ఒకే కుటుంబం అనే భావన కలుగుతోంది. ఇక్కడి నుంచి చూస్తే దేశాల మధ్య సరిహద్దులు, విభజన రేఖలు కనిపించవు, అంతా ఏకత్వమే కనిపిస్తుంది" అని తన అనుభూతిని పంచుకున్నారు.అమెరికాకు చెందిన యాక్సియం-4 మిషన్‌లో భాగంగా భారత వాయుసేనకు చెందిన శుభాంశు శుక్లా అంతరిక్షంలోకి వెళ్లారు. ఆయనతో పాటు అమెరికాకు చెందిన పెగ్గీ విట్సన్, పోలండ్‌కు చెందిన స్లావోస్జ్ ఉజ్నాన్స్కీ-విస్నీవ్స్కీ, హంగేరీకి చెందిన టిబర్ కపు ఈ బృందంలో ఉన్నారు.

మంత్రుల ముచ్చట.. ఏపీలో ఒకలా.. తెలంగాణలో మరోలా!

హైదరాబాద్ పెన్ పవర్: రెండు తెలుగు రాష్ట్రాల్లో మంత్రుల వ్యవహారం.. తరచుగా చర్చకు వస్తూనే ఉంది. అయితే.. ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం అన్నట్టుగా రెండు రాష్ట్రాల్లోనూ మంత్రుల వ్యవహారంలో తేడాలు ఉన్నా.. పద్ధతి మాత్రం ఒక్కటే అన్నట్టుగా ఉంది. ఏపీ విషయాన్ని తీసుకుంటే.. సీఎం చంద్రబాబుపై మంత్రులు ఎవరూ కామెంట్లు చేయరు. కానీ, తెరచాటున మాత్రం వారు చేయాలనుకున్నదే చేస్తున్నారు. అధినేత మాట వింటారు. కానీ, వారు ఏం చేయాలని తలపోస్తే అదే చేస్తున్నారు. ఉదాహరణకు .. ప్రజల్లో ఉండాలని చంద్రబాబు చెబితే.. ఓకే అంటారు. కానీ.. ప్రజల్లోకి వెళ్లినట్టే వెళ్లి సొంత పనులు చక్కపెట్టుకునే వారు 15 మంది వరకు ఉన్నారు. ఇది టీడీపీ లెక్క. మరి చంద్రబాబు మాట వినడం లేదా? అంటే.. వింటున్నారు. మీడియా ముందుకు వచ్చి వైసీపీపై నాలుగు విమర్శలు చేస్తారు. నియోజకవర్గానికి వెళ్తున్నట్టుగా వెళ్లి.. సొంత ఫొటోగ్రాఫర్లతో ఫొటోలు తీసుకుని.. వాటిని సోషల్ మీడియాకు ఇచ్చి.. ప్రచారం చేస్తున్నారు. తద్వారా అధినేత కళ్లకు చక్కటి గంతలు కడుతున్నారు. మరి ఈ విషయం చంద్రబాబుకు తెలిసో తెలియదో కానీ.. జరగాల్సింది జరిగిపోతోంది. ప్రజాదర్బార్‌ల పేరిట వారం వారం తమ తమ నియోజకవర్గాల్లో ఉండాలని చంద్రబాబు చెప్పారు. ఉండడమే కదా! అనుకుంటున్న నాయకులు అలానే చేస్తున్నారు. కానీ, సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదు. తాజాగా విశాఖ, తూర్పు, అనంతపురం జిల్లాల్లో కీలక మంత్రులకు ప్రజల నుంచి భారీ సెగ తగిలింది. తాము సమస్యలపై వినతి పత్రాలు ఇచ్చి నెలలు గడుస్తున్నా.. పరిష్కారం కాలేదని.. ధర్నాలుచేశారు. ఇక, తెలంగాణ విషయానికి వస్తే.. అంతర్గత కుమ్ములాటలు మంత్రుల పేషీల్లోనే జరుగుతున్నాయి. సీఎం రేవంత్‌రెడ్డిపై నేరుగా విమర్శలు చేస్తున్నవారు కనిపిస్తున్నాయి. ఇది తప్పుకాదని కూడా వారు సమ ర్థించుకుంటున్నారు. తమది అతి పెద్ద.. అంతర్గత ప్రజాస్వామ్యం ఉన్న పార్టీ అని చెప్పుకొంటున్నారు. తాజాగా పార్టీ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షీ నటరాజన్‌ను కలిసిన హైదరాబాద్‌కు చెందిన మంత్రి ఒకరు.. సీఎంపై ఫిర్యాదు చేయడం సంచలనంగా మారింది. ఇది బయటకు రాకుండా ఆమె రెండు రోజులు తొక్కి పెట్టారు. కానీ, దాగలేదు. పోనీ.. సీఎం రేవంత్ రెడ్డి చెబుతున్నట్టు మంత్రులు వింటున్నారా? అంటే.. అది కూడా కనిపించడం లేదు. ఒకరి శాఖలో మరొకరు జోక్యం చేసుకోవద్దని అంటున్నా.. ఎవరూ చెవిన పెట్టడం లేదు. కొండా సురేఖ శాఖలో ఓ మంత్రి వేలు పెట్టారు. ఇదే.. అసలు వివాదానికి కారణమని లేటుగా తేలింది. ఇలా.. మంత్రులు ఎవరికి నచ్చిన రీతిలో వారు ఉంటున్నారు. మరొకరు.. గౌడ సామాజిక వర్గానికి అన్యాయం జరుగుతోందని ఆ వర్గాన్ని రెచ్చగొట్టి సీఎం రేవంత్‌రెడ్డి వద్దకు పంపించారు. ఇలాంటి పరిణామాలతో ఇరు రాష్ట్రాల్లోనూ మంత్రుల వ్యవహారం రోజుకోరచ్చగా మారుతోంది.

'అతి' ఎప్పుడూ మంచిది కాదు బాబూ ..!

హైదరాబాద్ పెన్ పవర్: నాయకుల కోణం వేరు.. ప్రజల కోణం వేరు. అతిగా ఏం చేసినా.. ప్రజలు అంతే అతిగా తీసుకుంటారు. అది ఎవరికీ మంచిది కాదు. గతంలో చంద్రబాబును తిట్టించిన, పవన్‌ను దూషించిన నాయకుల పరిస్థితి ఏమైంది? రెండు చోట్ల ఓడిపోయారంటూ.. మూడు పెళ్లిళ్లు చేసుకున్నారంటూ.. పవన్‌పై చేసిన విమర్శల జడి అతిగా మారి.. చివరకు వైసీపీ పుట్టిముంచింది. చంద్రబాబును జైల్లో పెట్టేస్తే.. ఇక, తనకు తిరుగు ఉండదని అనుకుని అతికిపోయిన జగన్ పరిస్థితి ఏమైందో తెలిసిందే.

సో.. అతి అనేది రాజకీయాల్లో ఎంత ప్రమాదమో కొత్తగా చెప్పాల్సిన పని లేదు. ఇది ఒక్క వైసీపీకే కాదు. రాజకీయాల్లో పార్టీలకు.. నాయకులకు శాశ్వత శత్రువులుకానీ... శాశ్వత మిత్రులు కానీ.. లేనట్టుగానే.. ప్రజ లకు కూడా ఇలానే %-%శాశ్వత అధికార పార్టీ%-% ఉందా? ఉంటుందా?.. పురుచ్చితలైవిగా పేరొంది, వీధి వీధికీ గుడి కట్టించుకున్న జయలలితను కూడా ఓడించారు. ఒడిశాబీ పశ్చిమ బెంగాల్‌లలో కూడా.. అధికారం శాశ్వతం అనుకున్న వారు పక్కకు తప్పుకోక తప్పలేదు. ఇవన్నీ ఎందుకు చెప్పాల్సి వస్తోందంటే.. టీడీపీలోని మేధావి వర్గం రహస్యంగా విజయవాడలో భేటీ అయింది. ఈ సందర్భంగా.. భవిష్యత్తు రాజకీయ పరిణామాలపై అంచనా వేసింది. వీరిలో ఒకరిద్దరు నిత్యం చంద్రబాబుకు టచ్‌లో ఉండేవారేనని సమాచారం. ఈ క్రమంలోనే ప్రస్తుతం చంద్రబాబు చేస్తున్న వ్యాఖ్య లు.. ఫ్యూచర్ పాలిటిక్స్‌పై చర్చించిన మేధావులు.. అతి మంచిది కాదని తీర్మానానికి వచ్చారు. ప్రజలకు మంచి చేయడం, పెట్టుబడులు తీసుకురావడం వరకు కరెక్టేనని.. కానీ.. ప్రతిపక్షాన్ని అతిగా ప్రస్తావించడం ద్వారా.. ఇబ్బందులు వస్తాయన్నది వీరు చెబుతున్న మాట. అయితే.. ఈ రహస్య సమావేశం ఎక్కడ జరిగింది? అనేది గుట్టుగా ఉంచారు. అధికారంలోకి మళ్లీ వచ్చేస్తాం అనే ధీమా చంద్రబాబు వ్యక్తం చేయడాన్ని తప్పుబట్టారు. ఈ ధీమా ఆయన వరకు పరిమితం అయి తే మంచిదేనని.. కానీ, ఇదే ధీమా క్షేత్రస్థాయికి కూడా పాకి పోయిందని.. ఇది గత వైసీపీ 30 ఏళ్ల అధికారం ధీమాగా మారుతోందని మేధావులు అంచనా వేశారు. తద్వారా.. నాయకులు కట్టుతప్పి.. ఎవరికి ఇష్టం వచ్చినట్టు వారు వ్యవహరించే ప్రమాదం ఉందని, ఫలితంగా పార్టీ ప్రమాదంలో చిక్కుకునే అవకాశం ఉందని టీడీపీ మేదావి వర్గం అంచనా వేస్తోంది. అధికారం ఇవ్వడం.. ఇవ్వకపోవడం అనేది ప్రజల చేతిలో ఉన్న విషయాన్ని గమనించాల్సిన అవసరం ఉందని.. అతిగా ఊహించుకున్నా.. అతిగా అంచనా వేసుకున్నా.. మంచిదికాదన్నదివారు చెబుతున్న మాట. అయితే.. దీనికి సంబంధించిన విషయాలు .. చాలా రహస్యంగా ఉంచారు. ఓ సీనియర్ నాయకుడి ద్వారా ఒకటి రెండు విషయాలు మాత్రమే బయటకు పొక్కడం గమనార్హం. మరి చంద్రబాబుకు వీరు ఈ సూచనలు, సలహాలు ఇస్తారా? ఆయన పాటిస్తారా? అనేది చూడాలి.

బెంగళూరులో అద్దెలు తగ్గిస్తున్న ఓనర్స్.. టెక్కీలు చేస్తున్న ఆ పనితో..

హైదరాబాద్ పెన్ పవర్: ప్రస్తుతం నడుస్తోంది టెక్ ప్రపంచం. అయితే దీనిని వెనుక నుంచి నడిపించేది ఐటీ నిపుణులు, అనేక టెక్ కంపెనీలు. భారతదేశంలో ఐటీ రంగానికి పెట్టింది పేరు బెంగళూరు. ప్రస్తుతం టెక్ రంగం దాదాపు అన్ని రాష్ట్రాల్లోని నగరాలకు విస్తరించినప్పటికీ.. ప్రధానంగా బెంగళూరులో ఇది కేంద్రీకృతం అయ్యింది. అందుకే అక్కడ ఇంటి అద్దెలు కూడా ఊహించని స్థాయిల్లో చెబుతుంటారు ఓనర్స్. సంపాదించినదానిలో దాదాపు సగం అద్దెకు ఖర్చు కావటం ఇతర ప్రాంతాల నుంచి వచ్చి అక్కడ ఉద్యోగాలు చేస్తున్న వారిని నిరుత్సాహ పరుస్తోంది. ప్రస్తుతం కనీసం ఆఫీసు నుంచి ఇంటికి వెళ్లటానికి ట్రాఫిక్ లో రెండు మూడు గంటలు పట్టడం.. అధిక అద్దెలు, పొల్యూషన్, ప్రయాణ కష్టాలు, భాషా పరమైన ఇబ్బందులు ఇలా చెప్పుకుంటూ పోతే బోలెడన్ని సమస్యలు బెంగళూరుకు వస్తున్న ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోంది. పైగా ఫ్రెషర్లు కూడా తమ చదువు తర్వాత ఉద్యోగాల కోసం బెంగళూరుకు రావటం తగ్గించటంతో నగరంలో పీజీ హాస్టల్స్, ఇళ్లకు డిమాండ్ తగ్గుతోంది.

గతంలో దాదాపు లక్ష నుంచి రెండు లక్షలు డిపాజిట్ తీసుకునే యజమానులు చివర్లో పెయింటింగ్, అది ఇది అంటూ సగం వరకు నొక్కేసేవారు. ఇప్పటికీ ఆ పరిస్థితులు అలాగే ఉన్నాయనుకోండి. దీనికి తోడు ఏటా 20 శాతం వరకు అద్దెల పెంపుతో అసలు సంపాదిస్తోంది వారి కోసమా లేక బెంగళూరులో ఇంటి యజమానుల



కోసమా అనే అనుమానం చాలా మందికి కలుగుతోంది. దీనికి తోడు కరోనా సమయంలో నిర్మాణాలు ఆగటం ప్రాజెక్టులు, డెలివరీలను ఆలస్యం చేసింది. కానీ ప్రస్తుతం ఇవి ఊపందుకోవటంతో చాలా మంది వేలకు వేలు అద్దె కట్టడం కంటే అపార్ట్మెంట్ కొనుక్కుని దానికి ఈఎంఐ చెల్లించటం మంచిదని భావిస్తున్నారు. దీంతో చాలా మంది బెంగళూరులో నగరం నడిబొడ్డు నుంచి ఓఆర్ఆర్ చుట్టుపక్కల ప్రాంతాలకు వెళ్లిపోతున్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన చాలా మంది వర్క్ ఫ్రమ్ హెూమ్ లేదా వారి సొంత నగరాలకు దగ్గరలో ఆఫీసులకు తిరిగి మైగ్రేట్ అయిపోవటంతో అద్దె ఇళ్లకు డిమాండ్ తగ్గటం స్టార్ట్ అయ్యింది. చేసేది లేక ఇంటి ఓనర్లు సైతం గతంలో మాదిరిగా రుబాబు చూపించకుండా ఇంటి అద్దెలను తగ్గిస్తున్నారని రెడిట్ వేదికగా కొందరు చెబుతున్నారు. అలాగే అద్దెలు ఇల్లు తీసుకునే ముందు యజమానులతో మాట్లాడటం

ద్వారా 15 శాతం వరకు రెంట్ తగ్గించుకునేందుకు అవకాశం ఉంటుందని రెడిట్ యూజర్ చెప్పారు. చాలా మంది అధిక అద్దెలు కట్టలేక తమ యజమా నులను రెంట్స్ తగ్గించాలని కోరుతున్నారని వెల్లడించారు. అనేక చోట్ల ఇళ్లు టూలెట్స్ పెడుతుంటే ఎంక్వైరీలు కూడా తక్కువగా వస్తున్నాయని, అధిక అద్దెలకు ఉండేందుకు బెంగళూరులో ఎవ్వరూ ఇష్టపడటం లేదని వెల్లడైంది. ఇది చూస్తుంటే వాస్తవ పరిస్థితులను ఇంటి యజమానులు కూడా అర్థం చేసుకుంటున్నారనిపిస్తోంది.

మహా న్యూస్ ఛానెల్? ఆఫీసుపై BRS దాడి : ఖండించిన ప్రముఖులు

హైదరాబాద్ పెన్ పవర్: మహా న్యూస్ ఛానెల్ ఆఫీసుపై దాడి జరిగింది. 2025, జూన్ 28వ తేదీ మధ్యాహ్నం బీఆర్ఎస్ పార్టీకి చెందిన కొంత మంది వ్యక్తులు మూకుమ్మడిగా దాడి చేశారు. 30 నుంచి 40 మంది వరకు ఉన్న వాళ్లు.. వస్తూ వస్తూనే.. ఆఫీసు ఎదుట ఉన్న రెండు కార్లను ధ్వంసం చేశారు. పెద్ద పెద్ద రాళ్లను కార్లపై వేశారు. కార్లను పూర్తిగా ధ్వంసం చేశారు. ఆ వెంటనే మరికొంత మంది ఆఫీసుపై రాళ్లు వేశారు. రెండు, మూడు అంతస్తుల్లో ఉన్న కిటికీలు ధ్వంసం అయ్యాయి. ఈ రాళు ఆఫీసులో పని చేస్తున్న ఉద్యోగులపై పడ్డాయి. కొంత మందికి స్వల్ప గాయాలు అయ్యాయి. ఆఫీసుకు దూసుకెళ్లిన బీఆర్ఎస్ కార్యకర్తలు.. ఆఫీసులోని ఫర్నిచర్ ధ్వంసం చేశారు. కంప్యూటర్లు పగలగొట్టారు. రాళ్లు, కర్రలు, రాడ్లతో విధ్వంసం చేశారు. అద్దాలు ధ్వంసం చేశారు. ఆఫీసులో బీభత్సం చేశారు.

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఫోన్ ట్యాపింగ్ అంశంపై సిట్ విచారణ కొనసాగుతుంది. ఈ విచారణకు సంబంధించి.. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలోని అంశాలపై మహా న్యూస్ ఛానెల్ లో కథనాలు ప్రసారం అయ్యాయి. ఈ కథనాలు బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే, అప్పటి మంత్రి

కేటీఆర్ కు వ్యతిరేకంగా ఉన్నాయంటూ బీఆర్ఎస్ కార్యకర్తలు ఈ దాడికి పాల్పడినట్లు.. మహా న్యూస్ ఛానెల్ యాజమాన్యం స్పష్టం చేసింది. మీడియాలో వచ్చిన కథనాలపై అభ్యంతరాలు ఉంటే కూర్చుని మాట్లాడుకుందాం అని ఉద్యోగులు, సిబ్బంది చెప్పినా వినకుండా.. అత్యంత దారుణంగా.. కిరాతకంగా దాడి చేసినట్లు చెబుతున్నారు అక్కడి ఉద్యోగులు.

మహాన్యూస్ ఛానెల్ పై దాడిని చాలా మంది ఖండించారు. తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తోపాటు ఏపీ సీఎం చంద్రబాబు, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఉన్నారు. మీడియా స్వేచ్ఛను దాడులతో అణిచివేస్తాం అనుకుంటే పొరపాటు అంటూ చెప్పుకొచ్చారు. భౌతిక దాడులు సరికాదన్నారు. నిందితులను ఇప్పటికే గుర్తించాం అని..

త్వరలో అరెస్ట్ చేస్తామన్నారు మంత్రి పొన్నం ప్రభాకర్. మీడియాపై దాడి అనేది హేయమైన చర్య అంటూ ఖండించారు మంత్రి. మహా న్యూస్ ఛానెల్ ఆఫీసులో బీఆర్ఎస్ కార్యకర్తల విధ్వంసంపై మీడియా అసోసియేషన్లు కూడా స్పందించాయి. దాడిని ఖండించారు.

హైదరాబాద్ ఎస్ఆర్ నగర్ ఏటీఎంలో దొంగనోట్లు... బ్యాంకు ఉద్యోగులకే షాక్..

హైదరాబాద్ పెన్ పవర్: హైదరాబాద్ ఎస్ఆర్ నగర్ లోని ప్రముఖ బ్యాంకుకి చెందిన ఏటీఎంలో దొంగనోట్లు రావడం కలకలం రేపింది. ఏటీఎంలో డబ్బులు విత్ డ్రా చేద్దామని వెళ్లిన ఇద్దరు బ్యాంకు ఉద్యోగులు ఏటీఎంలో దొంగనోట్లు రావడంతో షాక్ అయ్యారు. రూ. 5 వేలు డ్రా చేయగా.. మొత్తం నకిలీ రూ. 500 నోట్లు వచ్చినట్లు తెలిపారు బాధితులు. ఈ ఘటనపై బ్యాంకు మేనేజర్ కి ఫిర్యాదు చేశారు ఉద్యోగులు. ఏటీఎంలో ఉన్న సీసీటీవీ ఫుటేజీ పరిశీలించగా.. గుర్తు తెలియని వ్యక్తి కస్టమర్ లా వచ్చి క్యాష్ డిపాజిట్ చేసి వెళ్లినట్లు గుర్తించారు బ్యాంకు సిబ్బంది.

ఈ ఘటనపై ఎస్ఆర్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు సిబ్బంది. బ్యాంకు సిబ్బంది ఫిర్యాదుతో ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా నిందితుడి కోసం గాలిస్తున్నట్లు తెలిపారు పోలీసులు. ఇప్పుడంటే యూపీఐ పేమెంట్స్ కి అలవాటు పడి చాలామంది క్యాష్ మెయింటైన్ చేయడం తక్కువయ్యింది కానీ.. నకిలీ నోట్ల పట్ల చాలా జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉంది. ఏకంగా ఏటీఎంలోనే నకిలీ నోట్లు డిపాజిట్ చేశారంటే.. దుండగులు ఏ రేంజ్ కి ఎదిగిపోయారో అర్థమవుతుంది. కాబట్టి.. ఇక మీదట ఏటీఎంలో క్యాష్ విత్ డ్రా చేసినా కూడా ఒకటికి రెండుసార్లు చెక్ చేసుకోవడం బెటర్.

స్కూళ్లలో జుంబా డ్యాన్స్?.. వ్యతిరేకిస్తున్న ముస్లిం సంఘాలు !

హైదరాబాద్ పెన్ పవర్: స్టూడెంట్స్ కేవలం క్లాసులు, చదువు, పరీక్షలు, హెూం వర్క్ అనే దానికే పరిమితం కాకుండా.. ఉల్లాసంగా, ఉత్సాహంగా, ఆరోగ్యంగా ఉండేందుకు కేరళ ప్రభుత్వం స్కూళ్లలో జుంబా డ్యాన్ ప్రవేశపెట్టింది. విద్యార్థుల ఫిజికల్, మెంటల్ ఫిట్ నెస్ కోసం ప్రతి రోజు జుంబా డ్యాన్స్ చేయించాలని నిర్ణయం తీసుకుంది. విద్యార్థులు కూడా చాలా ఉత్సాహంగా డ్యాన్స్ లో పాల్గొంటున్నారు. ప్రభుత్వ నిర్ణయంపై ఒకవైపు ప్రశంసలు వస్తుంటే.. మరోవైపు విమర్శలు ఎదురవుతున్నాయి. కేరళలో స్కూల్స్ లో జుంబా డ్యాన్స్ ఇంట్రడ్యూస్ చేయడం వివాదాస్పందా మారింది. యాంటీ-డ్రగ్ క్యాంపెయిన్ లో భాగంగా ఈ డ్యాన్స్ ను ప్రవేశపెట్టినట్లు ప్రభుత్వం చెబుతుంటే.. ముస్లిం సంఘాలు మాత్రం ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నాయి. గర్ల్స్, బాయ్స్ ఒకే చోట కలిసి డ్యాన్స్ చేయడం.. అందులో పొట్టి డ్రెస్ లతో జుంబా డ్యాన్స్ చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. ఈ ఏడాది నుంచి జుంబా డాన్స్ ట్రైయినింగ్ ను స్టార్ట్ చేస్తున్నట్లు చాలా స్కూల్స్ అనౌన్స్ చేశాయి. దీనిపై ముస్లి సంఘాలా ఆందోళ వ్యక్తం చేస్తున్నాయి. దీనిపై విజ్డమ్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ జనరల్ సెక్రెటరీ మాట్లాడుతూ.. దీన్ని తాము అంగీకరించమని.. ఈ సెషన్స్ లో తమ కుమారుడు పార్టిసిపేట్ చేయడని ఫేస్ బుక్ పోస్టులో ప్రకటించారు. ముస్లిం ఆర్గనైజేషన్ సమస్త సంఘానికి చెందిన మరో లీడర్.. నాసర్ ఫైజీ కూడ్తాయ్ మాట్లాడుతూ.. వ్యక్తిగత స్వేచ్ఛ హననం, వల్గారిటీ పెంచినట్లవుతుందని

విమర్శించారు. జుంబా అమ్మాయిలు అబ్బాయిలు ఇద్దరూ కలిసి చేసే డాన్స్. చిన్న చిన్న డ్రెస్ లు వేసుకుని చేసే డాన్స్. ఇది చాలా అభ్యంతరకరం అని అన్నారు. ప్రస్తుతం ఉన్న ఫిజికల్ ప్రోగ్రామ్స్ ను కాదని.. వల్గారిటీని ఇంప్లిమెంట్ చేయడం ఎంతవరకు సమంజసం అని ముస్లిం సంఘాలు ప్రశ్నిస్తున్నారు.

యాంటీ డ్రగ్ క్యాంపెయిన్ లో భాగంగానే..

స్కూళ్లలో జుంబా డ్యాన్స్ యాంటీ-డ్రగ్ క్యాంపెయిన్ లో భాగమేనని కేరళ విద్యా శాఖ మంత్రి వి.శివంకుట్టీ అన్నారు. ముస్లిం విద్యార్థులు కూడా ఉత్సాహంగా డాన్స్ చేస్తున్న వీడియోను పోస్ట్ చేశారు. “పిల్లలు సరదాగా ఆడాలి, పాడాలి, లాఫ్, ఫన్, హ్యాపీనెస్ తో పాటు పెరగాలి” అని అన్నారు. స్టూడెండ్స్ డ్రెస్ పై వస్తున్న విమర్శలను ఆయన ఖండించారు.

ఇలాంటి ఆలోచనలు పిల్లల మనసుల్లో డ్రగ్స్ ను మించిన విషాన్ని నింపుతాయని అన్నారు. 'పిల్లలు పొట్టి దుస్తులు వేసుకొమ్మని ఎవరూ అడగటం లేదు.. వాళ్లు స్కూల్ యూనిఫామ్స్ వేసుకుంటున్నారని చెప్పారు.

విద్యా హక్కు చట్టం (%=ఞ%) ప్రకారం.. పిల్లలు లెర్నింగ్ ప్రాసెస్ లో పార్టిసిపేట్ చేయాలని.. ఇందులో పేరెంట్స్ జోక్యం చేసుకునే అవకాశం లేదని తెలిపారు. “ఇది యాంటీ డ్రగ్ క్యాంపెయిన్.. అవేర్ నెస్ ప్రోగ్రామ్ లో భాగంగా కండక్ట్ చేస్తున్నాం. అలాంటి ఆలోచనలు పిల్లల్లో విభజన సంస్కృతిని డెవలప్ చేస్తాయి” అని బదులిచ్చారు. ఇంతకు ముందు జుంబా డాన్స్ పిల్లలు ఇష్టపూర్వకంగా, వాలంటరీగా చేరేదని, అందరూ చేయాలనే మ్యాండేటరీ రూల్స్ లేవని ప్రభుత్వం ప్రకటించింది. పిల్లల్లో స్ట్రెస్ తగ్గించి, ఫిజికల్, మెంటల్ ఫిట్ నెస్ తో పాటు కాన్ఫిడెన్స్ పెంపొందిచేందుకు అందరూ పార్టిసిపేట్ చేయిస్తున్నట్లు తెలిపింది. టీచర్లు కూడా జుంబా డాన్స్ కోసం స్పెషల్ ట్రెయినింగ్ తీసుకుంటారు. విద్యార్థులు, టీచర్లు కలిసి జుంబా డాన్స్ చేస్తుండటం ఆసక్తికరంగా మారింది. దీనిపై కొందరు విమర్శిస్తుంటే.. మరి కొందరు చాలా మంచి నిర్ణయమని ఆహ్వానిస్తున్నారు.

మండలంలో తెలుగుదేశం పార్టీ సమావేశం.

- మండల పార్టీ అధ్యక్షులుగా
- అడ్డాకుల నరేష్. ఎన్నిక.

గుమ్మలక్ష్మీపురం జూన్ 28 పవర్. గుమ్మలక్ష్మీపురం మండలం తెలుగుదేశం పార్టీ ఆడహక్ కన్వీనర్ పాడి సుదర్శన్ రావు అధ్యక్షతన తెలుగుదేశం పార్టీ సంస్థాగత ఎన్నికలు సమావేశం జరిగింది. ఈ సమావేశంనకు ప్రభుత్వ విప్ మరియు కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి పరిశీలకులుగా కేంద్ర కార్యాలయం నియామకం చేసిన మాజీ శాసన సభ్యులు, బుడా చైర్మన్ శ్రీ తెంటు లక్ష్మునాయుడు.రాష్ట్ర తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ గండి రామినాయుడు.పాల్గొన్నారు. గుమ్మలక్ష్మీపురం మండల పార్టీ అధ్యక్షులుగా అడ్డాకుల నరేష్ పేరును పాడి సుదర్శన్ రావు బలపరచగా ఏకగ్రీవంగా మండల నాయకులు, కార్యకర్తలు అందరూ ఆమోదం తెలపగా ఏకగ్రీవంగా అడ్డాకుల నరేష్ మండల పార్టీ అధ్యక్షులుగా ఎంపిక కావడం జరిగింది. ఈసమావేశంలో ఏఎంసి చైర్ పర్సన్ కద్రక కళావతి నాయకులు బిడ్డిక పద్మావతి,మండంగి భూషణ్, వివిధ హెూదాల్లో ఉన్న పలువురు మండల నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

వయోవృద్ధులకు ఇంటి వద్దకే "రేషన్" పంపిణీ...

కొయ్యూరు, పెన్ పవర్ జూన్ 28 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటి వద్దకే నిరుపేద కుటుంబాలకు ప్రతి నెల రేషన్ బియ్యం తో పాటు ఇతర నిత్యవసర సరుకులు అందిస్తుంది. శనివారం ఇందులో భాగంగానే కూటమి ప్రభుత్వం 65 సంవత్సరాలు నిండిన వృద్ధులకు, దివ్యాంగులకు ఇంటి వద్దకే రేషన్ బియ్యం తో పాటు నిత్యవసర సరుకులు పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు మండలంలోని రాజేంద్రపాలెం రేషన్ డిపో పరిధిలోని గ్రామాలకు డీలర్, వీఆర్వో సత్యనారాయణ, స్థానిక సర్పంచ్ పీట సింహాచలం 65 సంవత్సరాలు నిండిన వయోవృద్ధులకు, దివ్యాంగులకు రేషన్ సరుకులు పంపిణీ చేశారు. అనంతరం సర్పంచ్ పీట సింహాచలం మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం వృద్ధులకు, దివ్యాంగులకు ఇంటి వద్దకే రేషన్ పంపిణీ నిత్యవసర సరుకులు పంపిణీ చేయడం శుభ పరిణామమని ఆమె అన్నారు. నెల రాక మునుపే వారికి రేషన్, నిత్యవసర సరుకులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఇదిఇలా ఉండగా రేషన్ డీలర్ ఇంటి వద్దకే రేషన్,నిత్యవసర సరుకులు తెచ్చి ఇవ్వడంతో వృద్ధులు, దివ్యాంగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చింతలపూడి ఎంపీపీ పాఠశాలను మోడల్ ప్రైమరీ స్కూల్ గా అప్ గ్రేడ్

- ఉన్నత అధికారులకు హర్షం వ్యక్తం చేసిన చింతలపూడి గ్రామస్తులు

కొయ్యూరు, పెన్ పవర్ జూన్ 28: మండలంలోని చింతలపూడి గ్రామంలో ఉన్న ఎంపీపీ పాఠశాలను మోడల్ ప్రైమరీ స్కూల్గా అప్గ్రేడ్ చేసినందుకు పంచాయతీ సర్పంచ్, విద్యా కమిటీ సభ్యులు, పిల్లల తల్లిదండ్రులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. శనివారం ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్, కలెక్టర్ దినేశ్ కుమార్, ఎంఈవో ఎల్.రాంబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. మోడల్ ప్రైమరీ స్కూల్గా మార్చినందువల్ల విద్యార్థులకు మెరుగైన విద్య అందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సర్పంచ్ సెగ్గే రమాదేవి, విద్యా కమిటీ వైస్ చైర్మన్ ఉల్లి మరినమ్మ మాట్లాడుతూ... ప్రస్తుతం ఉన్న ఎంపీపీ పాఠశాలను మోడల్ ప్రైమరీ స్కూల్ గా అప్గ్రేడ్ చేసినందుకు విద్యార్థుల చదువు బాగుంటుందని వారు అభిప్రాయపడ్డారు. అనంతరం మంత్రి నారా లోకేష్, కలెక్టర్ దినేష్ కుమార్, మండల విద్యాశాఖ అధికారి రాంబాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక పెద్దలు ఉల్లి రాంబాబు, దేశిన మహేష్, సప్పి చెల్లాయమ్మ, కూడా చెల్లాయమ్మ, దొండ నాగమ్మ, పోలోజు రమణమ్మ, వినుకొండ భాస్కరరావు, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

36వ వార్డు వైఎస్ఆర్సీపి అడ్డా!

- వార్డు ప్రెసిడెంట్ మహమ్మద్ అబ్దుల్ షకీల్ కి అభినందనలు
- వార్డు సమన్వయ కమిటీ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే గణేష్ కుమార్

విశాఖ దక్షిణం, పెన్ పవర్, జూన్ 28 : దక్షిణ నియోజకవర్గంలో 36వ వార్డు పక్కా వైఎస్ఆర్సిపి అడ్డా అని మాజీ ఎమ్మెల్యే, దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ అన్నారు. జగన్మోహన్ రెడ్డి అభిమాన కార్యకర్తలకు ఉన్న వార్డులో నూతన అధ్యక్షుడి గా నియమితులైన మహమ్మద్ అబ్దుల్ షకీల్ కి వాసుపల్లి అభినందనలు తెలిపారు. ఆశీలమెట్ట కార్యాలయంలో శనివారం 36వార్డు సమన్వ య కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భం గా వాసుపల్లి గణేష్ కుమార్ మాట్లాడుతూ పార్టీ అభ్యున్నతికి కృషి చేయాలన్నారు. అలా గే కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు ఎండగట్టేలా ప్రజల్లో చైత న్యం నింపాలన్నారు. జగన్మోహన్ రెడ్డి 2.0 విధానంతో ముందుకు వెళ్తున్నారని, భవిష్య త్తులో వైఎస్ఆర్సిపి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. చంద్రబాబు ఎన్ని కుతంత్ర రాజకీయాలు చేసిన ఎవరు భయపడే ప్రసక్తే లేదన్నారు. ప్రజల పక్షాన న్యాయపోరాటం చేసేందుకు వైఎస్ఆర్సిపి సిద్ధంగా ఉందని వాసు పల్లి తెలిపారు. 36వ వార్డులో పార్టీనీ వీడి వెళ్లిపోయిన కార్యకర్తలు మళ్లీ తిరిగి వస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఇప్పటికే కూటమి ప్రభు త్వంలో గుర్తింపు లేక నేతలు కార్యకర్తలు నిస్సహాయ స్థితిలో ఉన్నారన్నారు. వైఎస్ ఆర్సిపిని మరింత బలోపేతం చేసే విధంగా ఐక్యతతో ముందుకు వెళ్లాలని వాసుపల్లి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సౌత్ చేనేత విభాగం అధ్యక్షురాలు కాకి పద్మ , సౌత్ వాణిజ్య విభాగం అధ్యక్షులు కడియం ప్రసాద్, సాగర్, జమీల్, కిషోర్,చెన్నా శ్రీధర్, శత్రువు,సత్యం, స్వప్న, భాను, కనకమహాలక్ష్మి, జాహు ఫరాలీ, ఎండి మెహరుల్లా, జే ఎంపీ అనీస్, క్రజో, డీ లియాక్వాట్, షోబీర్, డాక్టర్ అజీజోలువా,కె. సుబ్రహ్మణ్యం, కె. మాదవ, కె. రాజు, ఎండి సలీమ్, అనీస్,షాబీర్ మొహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

వార్డుల అభివృద్దే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం

- రూ.219.41 లక్షల వ్యయంతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- నగర మేయర్ పీలా శ్రీనివాసరావు

స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, విశాఖపట్నం జూన్ 28 : విశాఖపట్నం జూన్-28: జీవీఎంసీ పరిధిలోని వార్డుల అభివృద్దే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని నగర మేయర్ పీలా శ్రీనివాసరా వు పేర్కొన్నారు. శనివారం ఆయన జీవీఎంసీ 8వ జోన్ 93వ వార్డు పరిధిలో జీవీఎంసీ సాధార ణ నిధుల నుండి సుమారు రూ. 219.41 లక్షల వ్యయంతో పలు అభివృద్ధి పనులకు పెందుర్తి శాసనసభ్యులు పంచకర్ల రమేష్ బాబు, వార్డ్ కార్పొరేటర్ రాపర్తి త్రివేణి వరప్రసాదరావు (కన్నా) లతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ అభివృద్దే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని, దేశ ప్రధాని నరేంద్ర మోడీ సారథ్యం లో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం విశాఖ అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ చేపడుతున్నా రని తెలిపారు. జీవీఎంసీ పరిధిలోని ప్రతి వార్డు లలో అంచెలంచెలుగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని, అందులో భాగంగా 8వ జోన్ 93వ వార్డు పరిధిలోని దుర్గా నగర్, కృష్ణానగర్, సింహాద్రి నగర్, ప్రహ్లాదపురం, విరాట్ నగర్, శంకర్ ఫౌండేషన్ పోస్టల్ కాలనీ, శ్రీనివాస నగర్, వెంకటాద్రి నగర్ తదితర ప్రాంతాలలో సుమారు రూ. 219.41 లక్షల వ్యయంతో సిసి రోడ్లు, సీసీ కాలువలు, ఎస్ డబ్ల్యూ కాలువలు, కమ్యూనిటీ హాల్స్ నిర్మాణానికి శంకుస్థాపన చేయడం జరిగిందని తెలిపారు. సంబంధిత కాంట్రాక్టర్ల చే పనులు వెంటనే ప్రారంభించి నిర్ణీత సమయంలో పూర్తి అయ్యేలా చూడాలని జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులను మేయర్ ఆదేశించారు. అనంతరం పెందుర్తి శాసనసభ్యులు మాట్లాడుతూ రాష్ట్రం లోని కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం అభివృ ద్ధి పై దృష్టి కేంద్రీకరించి అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుందన్నారు. జీవీఎంసీ నిధులతో పాటు ఎమ్మెల్యే నిధులను కూడా వార్డుల అభివృద్ధికి ఖర్చు చేస్తామని శాసనసభ్యులు తెలిపారు. పెందుర్తి నియోజకవర్గం లోని 93వ వార్డులో సుమారు రూ. 2.19 కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు నేడు శంకుస్థాపన చేశామని శాసనసభ్యులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ బి. హేమా వతి, జీవీఎంసీ పర్యవేక్షక ఇంజనీరు కె . శ్రీనివా సరావు, కార్యనిర్వహక ఇంజనీరు దిలీప్, ఉప కార్య నిర్వహక ఇంజనీరు, జీవీఎంసీ సిబ్బంది, పలువురు టిడిపి, జనసేన పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు .

ప్రభు త్వం నుంచి పీఎం ఉషా పథకం కింద రూ.4.5 కోట్లు మంజూరు

- విద్యా వ్యవస్థ బలోపేతానికి ప్రభుత్వ ప్రాధా న్యం
- డిగ్రీ కాలేజీ భవనానికి భూమిపూజ చేసిన ఎమ్మెల్యే గంటా

బిమిలి,పెన్ పవర్, జూన్ 28 : విద్యా వ్యవస్థను బలోపేతం చేయడానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తుందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. ఆనందపురంలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీకి శనివా రం భూమి పూజ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. 2014 - 19 మధ్యలో తాను విద్యా శాఖ మంత్రిగా ఉన్నప్పుడు కేంద్ర ప్రభు త్వం నుంచి పీఎం ఉషా పథకం కింద రూ. 4.5 కోట్లు మంజూరు చేయించానని తెలిపారు. వైసీపీ ప్రభుత్వ హయంలో కాలేజీ నిర్మాణం దిశగా ఒక్క అడుగు కూడా ముందుకు పడ లేదన్నారు. డిగ్రీ కాలేజీ భవన నిర్మాణం ఏడాది లోగా పూర్తి చేసుకుని, వచ్చే విద్యా సంవత్సరం నాటికి అందులో తరగతులు జరగాలని ఆకాంక్షించారు. రాజకీయాలకు అతీతంగా ఆనందపురం ప్రజలు కాలేజీని నెంబర్ వన్ స్థానంలో నిలబెట్టాలన్నారు. కాలేజీ చుట్టూ ప్రహరీ గోడ నిర్మించాలని సూచిస్తూ.. నిర్మా ణంలో అదనపు నిధులు అవసరమైతే దాతలు, పరిశ్రమల సి.ఎస్.ఆర్. నుంచి సమకూర్చుతాన ని హామీ ఇచ్చారు. విద్యా శాఖ మంత్రిగా నారా లోకేష్ చేపడుతున్న విద్యా సంస్కరణలను మేధావులు సైతం ప్రశంసిస్తున్నారని తెలిపారు. కేజీ నుంచి పీజీ వరకూ విద్యా సంవత్సర క్యాలెండర్ ముందుగానే ఇవ్వడం వల్ల విద్యార్థు లు, టీచర్లు ముందస్తు ప్రణాళికలు రూపొందిం చుకోవడానికి వీలుగా ఉంటుందన్నారు. టీచింగ్ వ్యవస్థను పటిష్టం చేయడానికి మెగా డీఎస్సీ ద్వారా 16,437 పోస్టులు భర్తీ చేస్తున్నామని చెప్పారు. యోగాంధ్ర గిన్నీస్ రికార్డుతో విశాఖప ట్నం ప్రపంచ దృష్టిని ఆకర్షించిందని.. ఆరోగ్యా న్ని కాపాడుకోవడానికి పాఠ్యాంశాల్లో యోగాను ఒక సబ్జెక్టుగా ప్రవేశపెట్టాలని భావిస్తున్నామని వెల్లడించారు. డిగ్రీ కాలేజీ నిధులు మురిగిపోయే ప్రమాదముందని చెప్పిన వెంటనే ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు స్పందించి జిల్లా కలెక్టర్, రెవిన్యూ అధికారులతో మాట్లాడి కేవలం రెండు నెలల్లో 5 ఎకరాల భూమిని మంజూరు చేయిం చారని డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ పి.శ్రీవాణి కృతజ్ఞ తలు తెలియజేశారు. గంటా నారాయణమ్మ పేరిట డిగ్రీ కాలేజీలో లైబ్రెరీ భవనాన్ని నిర్మిస్తా నని స్థానిక నాయకుడు ఘట్టమనేని సుభాష్ చంద్రబోస్ ప్రకటించారు.

ఈ కార్యక్రమంలో తర్లువాడ సర్పంచ్ బి.ఆర్.బి. నాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు తాట్రాజు అప్పారావు, ఎంపీపీ మజ్జి శారద, మీసాల సత్యనారాయణ, గాడు వెంకటప్పుడు, కోరాడ రమణ, కాళ్ల నగేష్ కుమార్, డి.ఎ.ఎన్. రాజు, లొడగల అప్పారావు, గంటా నూకరాజు, బమ్మిడి ఉమ, మొల్లి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేని కలసిన జిల్లా రవాణా శాఖ అధికారి.

గుమ్మలక్ష్మీపురం జూన్ 28.పెన్ పవర్. ఎమ్మెల్యే గారి క్యాంపు కార్యాలయంలో శనివారం నాడు ప్రభుత్వ విప్ మరియు కురుపాం శాసనసభ్యురాలు తోయక జగదీశ్వరిని జిల్లా నూతన రవాణాశాఖ అధికారి దుర్గాప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో ప్రమాదాలను తగ్గించేలా పటిష్ట చర్యలు చేపట్టాలని ఆర్టీవో కు ఎమ్మెల్యే సూచించారు.ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాలలో వాహన చోదకులకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు.అలాగే వాహనాలు నడిపే 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు లైసెన్సులు తీసుకునేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.

డ్రంకన్ డ్రైవ్ పట్టుబడితే రూ.10 వేలు జరిమానా లేదా జైలుశిక్ష

- 67 డ్రంకన్ డ్రైవ్ కేసుల్లో రూ.6.70 లక్షల జరిమానాం
- విజయనగరం జిల్లా ఎస్పీ వకుల్ జిందల్,

క్రైమ్ బ్యూరో, పెన్ పవర్, విజయనగరం, జూన్ 28 : మద్యం సేవించి వాహనాలు నడిపి, పట్టుబడిన 67మంది వాహనదారులు ఒక్కొక్కరికి రూ. 10 వేలు జరిమానాను విజయనగరం అడిషనల్ జుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎం.ఎస్. హెచ్.ఆర్.తేజ చక్రవర్తి విధించారని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ జూన్ 28న తెలిపారు.జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశాలతో విజయనగరం ట్రాఫి క్ సిఐ సూరినాయుడు ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులు మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టి, మద్యం సేవించి, వాహనాలు నడిపిన వారిపై 67 కేసులు నమో దు చేసి, విజయనగరం అడిషనల్ జుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వారి వద్ద హాజరుపర్చగా,
మెజిస్ట్రేట్ శ్రీ ఎం.ఎస్.హెచ్.ఆర్.తేజ చక్రవర్తి గారు ఒక్కొక్కరికి రూ. 10వేలు చొప్పున మొత్తం 67 మందికి రూ. 6.70 లక్షలను జరిమానగా విధించారని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపా రు.మద్యం మత్తులో వాహనాలు నడిపితే ప్రమాదాలకు గురవ్వడం లేదా ఇతర వాహనా లను ఢీ కొట్టి ప్రమాదాలకు కారకులవుతు న్నారన్నారు. ఈ తరహా వాహనదారులను కట్టడి చేసేందుకు, ప్రమాదాలను నియంత్రిం చేందుకు ప్రతీ రోజూ నిర్వహిస్తున్న విజిబుల్ పోలీసింగులో భాగంగా ప్రత్యేకంగా డ్రంకన్ డ్రైవ్ చేపట్టి, డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు చేపడుతూ, మద్యం సేవించి, వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేస్తున్నామన్నామని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు.

ఏడీసీపీలు నుండి ఇన్స్పెక్టర్ స్థాయి అధికారుల తో రివ్యూ మీటింగ్

క్రైమ్ బ్యూరో, పెన్ పవర్, విశాఖపట్నం, జూన్ 28 :నగర పోలీసు కమీషనర్ డా.శంఖబ్రత బాగ్చి, ఐ.పి.ఎస్., కాన్ఫరెన్స్ హాల్ నందు పోలీసు ఉన్నతాధికారులతో కలిసి ఏడీసీపీలు నుండి ఇన్స్పెక్టర్ స్థాయి అధికారులతో ఏర్పాటు చేసిన ఈ నెల రివ్యూ మీటింగ్ లో ప్రతి ఒక్క పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ల పనితీరును పరిశీలించారు.

నగరంలో ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో యాక్టీవ్ గా ఉన్న రౌడీ షీటర్లు,వారిపై పెడుతున్న నిఘా చర్యలను ఆరా తీశారు, నిన్నటి వరకూ నమో దు చేసిన ఎన్ డి పి ఎస్ కేసు వివరాలను సమీక్షించి, నగరం గుండా ఏటువంటి %చీణూా% రవాణా జరగకుండా పూర్తిగా నిరోధించాలని తెలిపారు.ట్రాఫిక్, క్రైమ్, లా అండ్ ఆర్డర్ లకు నిర్వహించిన ఈ నెల రివ్యూ మీటింగ్ నందు ఆయా విభాగాల పనితీరును సీపీ పూర్తిగా సమీక్షించారు.నగరంలో పోలీస్ స్టేషన్లో లాంగ్ పెండింగ్ లో ఉన్న కేసులు యొక్క వివరాలు, కేసు పెండింగ్ ఉండడానికి గల కారణాలు తెలుసుకొని సదరు పెండింగ్లో ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించివలసిందిగా ఆదేశిం చారు, కోర్టు తీర్పు వెలువరించిన కేసుల వివరాలు తెలుసుకున్నారు.సిపి ఇచ్చిన నంబరు కు వచ్చిన ఫిర్యాదులు ఆధారముగా పలు సమస్యాత్మక ప్రాంతాలను సిపి గారు తెలియజేసి, ఆయా ప్రాంతాలకు సంబంధించిన స్టేషన్ ఎస్.హెచ్.ఓ లతో ఆయా సమస్యలకు పూర్తి అడ్డుకట్ట వేసేలా నిర్ణీత సమయంలో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ప్రతీ స్టేషన్ పరిధిలో యెటువంటి అసాంఘిక కార్యకలాపా లు జరుగకుండా పూర్తిగా నివారించాలని, ఆయా స్టేషన్ పరిధిలో గల నిర్మానుష్యప్రాంతాలను, సమస్యాత్మక ప్రాంతాలను పరిశీలిస్తూ విజిబుల్ పోలీసింగ్, పీకేట్, అవసరం మేరకు డికొయ్ టీంలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.స్టేషన్ పరిధిలో శాంతి భద్రతలు పూర్తి అదుపులో ఉండాలనీ, గంజాయి ఎక్కడా ఉండరాదని, ఈవ్ టీజింగ్, ట్రిపుల్ రైడింగ్, రాష్ డ్రైవింగ్ వంటి ఏ స్టేషన్ పరిధిలోనూ చోటు చేసుకోకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని, అందుకు అదనంగా వెహికల్, మెన్ ఇతర అవసరాలు ఏమైనా ఉన్నచో తనకు తెలియ జేయాలని తెలిపారు.నగరంలో అన్ని పోలీస్ స్టేషన్ల లో కేసులు నమోదు చేస్తున్న తీరు, అధికారులు ఫిర్యాదుదారులతో ప్రవర్తిస్తున్న తీరు పై ఆరా తీసి, తగు ఆదేశాలు జారీ చేశారు.

పోక్సో కేసుల పైన ఆరా తీశారు, నగరంలో క్రైమ్ రేటు తగ్గు ముఖం పట్టేలా రాత్రి పూట నిఘా మరింత పటిష్టం చేయాలనీ తెలిపారు.

విజిటర్స్ మానిటరింగ్ సిస్టమ్ ను పూర్తిగా లా %ద% ఆర్డర్ మరియు క్రైమ్ సిబ్బంది అందరూ విని యోగిస్తూ నిందితులను మరింత వేగముగా గుర్తించాలని తెలిపారు.సైబర్ క్రైమ్ పై మరింత బలోపేతం చేసే చర్యలపై చర్చించారు, ప్రజలకు పూర్తి అవగాహన అయ్యేలా మరిన్ని అవగాహ న కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు, పలు కొత్త సాఫ్ట్ వేర్ లను తీసుకొని వినియోగిం చాలని సూచించారు.ఉమెన్ సేఫ్టీ కు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని, మహిళల పైన వేదిం పులు, మహిళ మిస్సింగ్ సంబంధిత కేసులలో జాప్యం లేకుండా తక్షణమే స్పందించి ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానంలో వారితో వ్యవహరిం చాలన్నారు,పోక్సో కేసుల పైన ఆరా తీశారు.

కోర్టు నందు కేసులు ఎటువంటి జాప్యం లేకుం డా, కన్విక్షన్ పడే కేసులు సంఖ్య పెరిగే విధము గా చేయుటకు, అధికారులు మరియు సిబ్బంది సందేహాలను నివృత్తి చేసేందుకు లోక్ ఆధాలత్ నందు గతంలో కంటే మరిన్ని ఎక్కువ కేసులు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని తెలిపా రు.పబ్లిక్ ప్రాసిక్యూటర్లను ఆహ్వానించి పలు న్యాయ సంబంధిత అంశాలపై పరస్పరం చర్చిం చి, పోలీసు అధికారులు పలు న్యాయ సంబంధి త అంశాలలో తమ సందేహాలను పబ్లిక్ ప్రాసి క్యూటర్లను ను అడిగి నివృత్తి చేసుకున్నారు.

వచ్చే నెల నిర్వహించబోవు రివ్యూ మీటింగ్ నందు ప్రతి పోలీస్ స్టేషన్ గత నెల కంటే మెరు గ్గా, క్రైమ్ తగ్గు ముఖం పట్టే విధముగా పోలీ సింగ్ ఉండాలని తెలిపారు.నగర పోలీసు అధి కారులు మరియు సిబ్బంది పూర్తి పారదర్శక ముగా తమ విధులు నిర్వర్తించాలని, విధులలో ఎటువంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా, అధికార దుర్వినియోగానికి పాల్పడినా, అవినీతికి పాల్పడినా తక్షణమే వారిపై కఠిన చర్యలు ఉంటాయనీ తెలిపారు.

ఈ సమావేశంలో డి.సి.పి-01(ఎల్%ద% ఓ) అజితా వేజెండ్ల, ఐ.పి.ఎస్., డి.సి.పి(క్రైమ్స్) కే.లతా మాధురి , నగర ఏ.డి.సి.పి లు, ఏ.సి.పి లు, స్టేషన్ ఎస్.హెచ్.ఓ లు ఇతర అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి నుండి బాధితుడుకి చేయూత

గాజువాక :పెన్ పవర్,జూన్ 28:గుండెకు సంబంధించిన సమస్యతో హాస్పిటల్లో చికిత్స పొంది హాస్పిటల్ బిల్లును బిల్లు చెల్లించడానికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి గాజువాక శాసనసభ్యుడు పల్లా శ్రీనివాసరావు సహకారంతో బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయంగా చెక్కును బాధిత కుటుంబ సభ్యులకి అందజేస్తున్న కూటమి నాయకులు అందజేశారు.

శానిటేషన్ పనులను దగ్గర నుండి పర్యవేక్షించిన ఎంపీడీవో

ప్రతి పంచాయతీలో సక్రమంగా శానిటేషన్ నిర్వహించాలి

గూడెం కొత్త వీధి,పెన్ పవర్, జూన్ 28: అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండలం గుమ్మరేవుల పంచాయతీ కేంద్రంలో ఎంపీడీవో ఉమామహేశ్వరరావు డిప్యూటీ ఎంపీడీవో పాపారావు, స్థానిక సర్పంచ్ కమలమ్మ లతో కలిసి స్థానికంగా నిర్వహిస్తున్న శానిటేషన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అన్ని పంచాయతీలలో ఈ నెల రోజులు శానిటేషన్ సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. తడి చెత్త పొడి చెత్త వేరువేరుగా చేసి ఎస్ డబ్ల్యూ పిసిలకు తరలించాలని సూచించారు. సీజనల్ వ్యాధులు సంక్రమించకుండా ఇప్పటినుండే సక్రమంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, డిప్యూటీ ఎంపీడీవో పాపారావు, గుమ్మిరేవుల సర్పంచ్ కమలమ్మ, పంచాయతీ సెక్రెటరీ, క్లాప్ మిత్రాలు, తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ సారాధ్యంలో డిఏజుగా కార్యక్రమం

గూడెం కొత్తవీధి,పెన్ పవర్, జూన్ 28:పీవీటిజి ఆదిమ సమూహాలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాల లబ్ధి చేకూర్చటమే డిఏ జుగా కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమని దామనపల్లి సర్పంచ్ కుందేరి రామకృష్ణ తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండలం దామనపల్లి పంచాయతీలో దామనపల్లి గ్రామంలో ప్రత్యేక అధికారి మండల వ్యవసాయ శాఖ అధికారి మధుసూదన్ రావు పర్యవేక్షణలో జన జాతీయ గౌరవ వర్ష్ వేడుకలు ధర్తీ అబా జన్ భగీదరి అభియాన్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన గ్రామ సభలలో ఆయన మాట్లాడారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా బిజెపి ఉపాధ్యక్షులు చిరంజీవి మాట్లాడుతూ పివిటిజి ఆదిమజాతి గిరిజనులు అందరూ ప్రభుత్వం అందిస్తున్నటువంటి ఆరోగ్య సేవలు, విద్య, ఆర్థిక సహాయం, మౌలిక సదుపాయాలు, అలాగే ఆధార్ నమోదు ఈ శ్రమ్ రిజిస్ట్రేషన్ వంటగ్యాస్ కలెక్షన్ల వంటి పథకాల గురించి అవగాహన పెంచుకోవడం కొరకు ఈ గ్రామసభను నిర్వహిస్తున్నట్లు వివరించారు. పివిటిజి ఆదిమ జాతి తెగలకు మౌలిక సదుపాయాల కల్పన కొరకు, అవగాహన కలిగి ఉండటం కొరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించి వారికి అవగాహన కల్పించడం ప్రభుత్వం యొక్క ముఖ్య ఉద్దేశం గా ఉందని తెలిపారు.పివిటిజి ల అభ్యున్నతి కోసం ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని వివరించారు. అంగన్వాడీ కార్యకర్తలు పోషకాహారాలతో కూడిన స్థాలను ఏర్పాటు చేశారు. వైద్య సిబ్బంది మెడికల్ క్యాంపు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సెక్రటరీ రుత్తుల వెంకట శివలక్ష్మి, వీఆర్వో తగ్గి రామారావు, వార్డు సభ్యులు కృష్ణ డిజిటల్ అసిస్టెంట్ శేఖర్, వెల్ఫర్ అసిస్టెంట్ పాత్రుడు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ యుగంధర్,వెటర్నరీ అసిస్టెంట్ బేరా బాలయ్య, మహిళా పోలీసు భారతి,ఎంఎల్ హెచ్ పిఓ తనూజ, పేసా ఉపాధ్యక్షులు సిందరి కారయ్య, ఇతర పేసా కమిటీ సభ్యులు ,వార్డు సభ్యులు,ఆశ అంగన్వాడీ కార్యకర్తలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారిణిగా శ్రీదేవి బాధ్యతలు

చింతపల్లి పెన్ పవర్ జూన్ 28:- చింతపల్లి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారిణిగా శ్రీదేవి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె కార్యాలయంలో ఫైల్స్ పరిశీలిస్తూ అధికారిక విధులను ప్రారంభించారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా వడ్డాది మాడుగుల ప్రాజెక్ట్ నుంచి ఆమెను చింతపల్లికి బదిలీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆమె మాట్లాడుతూ మండలంలో సుమారు 250 అంగన్వాడి కేంద్రాలు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం ద్వారా పంపిణీ అవుతున్న అంగన్వాడి సరుకులు అన్ని కేంద్రాలకు సమయానికి, సక్రమంగా చేరేందుకు తగిన చర్యలు తీసుకుంటానని తెలిపారు. అంగన్వాడి కార్యకర్తలు, ఆయాలు కలిసికట్టుగా పనిచేస్తేనే లక్ష్యాలు చేరుకోవడం సాధ్యమవుతుందన్నారు. అందుకే తగిన సమన్వయం ద్వారా ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయాలని, అందరూ సహకరించాలని ఆమె కోరారు.

వంచులలో ధర్తీ అబ జన్ భగీదరి అభియాన్ కార్యక్రమం

గూడెం కొత్తవీధి,పెన్ పవర్, జూన్ 28: అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి వంచుల పంచాయతీ కేంద్రంలో స్థానిక సర్పంచ్ వనపల కాసులమ్మ ఆధ్వర్యంలో ధర్తీ అబ జన్ భగీదరి అభియాన్ కార్యక్రమంలో భాగంగా పి.వి.టి.జి గిరిజనులకు కావలసిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో వక్తలు మాట్లాడుతూ పివిటిజి గిరిజనులు ఆర్థిక సామాజిక రంగాలలో అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు చేపడుతుందని, వారికి విద్య వైద్యం ఆరోగ్యం ఇతర మౌలిక సదుపాయాల కల్పన కొరకు ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తుందని, వారిలో ప్రతి ఒక్కరూ బ్యాంకు అకౌంట్ ను కలిగి ఉండి, ఆధార్, గ్యాస్ కలెక్షన్, ఇతర మౌలిక సదుపాయాలన్నీ కలిగి ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ శివ, పంచాయతీ విఆర్ఓ అచ్చిబాబు, వార్డ్ సభ్యులు పొత్తూరు సోములమ్మ, కూటమి నాయకులు, వైసీపీ నాయకులు లొంజా గణపతి, వనపల రాజేష్, జోగిరాజు,పోత్తూరు గంగరాజు, చిట్టి బాబు, వి చిన్నబ్బాయి సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శ్రీదేవి భూదేవి సమేత వైకుంఠ వెంకటేశ్వర స్వామి ఆలయంలో అన్న ప్రసాద వితరణ

గాజువాక: పెన్ పవర్ జూన్ 28:గరుడాద్రి కొండపై వెలసిన వైకుంఠ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రతి శనివారం నిర్వహించే అన్న ప్రసాద వితరణ ఆలయ ధర్మకర్త మంత్రి మంజుల, ఆలయ చైర్మన్ దొడ్డి రమణ నేతృత్వంలో ఆలయ సేవకులు వారి ఆర్థిక సహాయంతో అన్న ప్రసాద వితరణ జరిగినది. ఈ కార్యక్రమానికి బీహార్ స్టేట్ బిజెపి వైస్ ప్రెసిడెంట్ సురేష్ రుమగట్, బిజెపి సైనిక సెల్ కన్వీనర్ అగ్గాల హనుమంతరావు, బిజెపి లీడర్ ఆర్ పి సింగ్, సురేష్ సింగ్, రాజా సింగ్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులు మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో ఉత్తర ద్వారంలో వెలసిన వైకుంఠ వెంకటేశ్వర స్వామి వాంబే కాలనీ వైకుంఠ వెంకటేశ్వర స్వామి ఆలయం వైకుంఠ వెంకటేశ్వర స్వామి ఏడు వారాలు నిష్టతోతో పూజ చేసి ఏడు ప్రదర్శనలు స్వామి వారి ఆలయం చుట్టూ తిరిగి ప్రదర్శలు స్వామివారిని కోరిన కోర్కెలు తీర్చుతారని భక్తులకు ప్రగాఢ నమ్మకం. ఈకార్యక్రమంలో పెంటకోట రాజు, కొవిరి జానకి, నాగమణి, సత్యవతి, లక్ష్మమ్మ, బొబ్బిలి స్వాతి, కుమారి, మంగ, శ్రీలక్ష్మి, పద్మ, అనిత, చాముండేశ్వరి ఆలయ కమిటీ సభ్యులు ఆలయ పోషకులు ఆలయానికి ఆర్థికంగా సహాయం చేసిన భక్తులందరూ పాల్గొన్నారు.

87వ వార్డ్ ను స్మార్ట్ వార్డ్ గా తీర్చిదిద్దుతాం

- శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న టిడిపి రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్నాథం

గాజువాక:పెన్ పవర్, జూన్ 28:జివియంసి 87వ వార్డ్ ను స్మార్ట్ వార్డ్ గా తీర్చిదిద్దానంటూ వార్డులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి స్థానిక వార్డు కార్పొరేటర్ బొండా జగన్నాథం అన్నారు. ఈ సందర్భంగా లక్ష్మీపురం కాపు వీధి మరియు అప్పకొండ చెట్టిబలిజ ప్రాంతాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు జరిగాయి. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ అప్పికొండ ప్రజలు ఎప్పటినుంచో ఒక సామాజిక భవనం కోసం ఎదురుచూస్తున్నారని నేటికీ ఆకల నరవేర బోతుందని, అదేవిధంగా లక్ష్మీపురం సామాజిక భవనం చుట్టూ ప్రహరీ నిర్మాణం కోసం జీవీఎంసీ నిధులు మంజూరు చేయించామని,ఈ పనులు త్వరలో పూర్తి అవుతాయని అన్నారు.ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు సాగి విజయరామరాజు,మాజీ హాస్పిటల్ అభివృద్ధి కమిటీ చైర్మన్ రాజన్ రాజు, బీజేపీ కో కన్వీనర్ లక్కరాజు సోమరాజు, సెక్రటరీ బొట్టా ప్రకాష్,వర్రే రాంబాబు, శిరసపల్లి బాబురావు,ప్రగడ దానయ్య, కణితి ఈశ్వరరావు, గ్రామ పెద్దలు అవిరెడ్డి సూర్యనారాయణ, పొలారావు, మల్ల రాము,కనక సత్యం, పోతల కృష్ణ, ఏటియన్ మూర్తి ,సుందర్ సునీల్,వై. నాగేశ్వరరావు,శానిటేరి సిబ్బంది,లక్ష్మీపురం మరియు అప్పికొండ చెట్టిబలిజ గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అభివృద్ధికి అడ్డు? అధికారుల నిర్లక్ష్యం వెనుక రాజకీయ ఒత్తిళ్లు!

ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వర రాజు మీడియా సమావేశంలో ఘాటు వ్యాఖ్యలు

స్టాఫ్ రిపోర్టర్,పాడేరు/గూడెం కొత్తవీధి,పెన్ పవర్,జూన్ 28: గిరిజన ప్రాంతాల్లో రోడ్డు విస్తరణలో అక్రమ కట్టడాల తొలగింపుపై జిల్లా అధికారులు నిర్లక్షం చూపడాన్ని తీవ్రంగా వ్యతిరేకించిన పాడేరు శాసన సభ్యులు మత్స్యరాస విశ్వేశ్వర రాజు “అభివృద్ధికి అడ్డుపడటం దేనికి సంకేతం?” అంటూ ప్రశ్నించారు.మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన, హైకోర్టు ఆదేశాల ప్రకారం 5వ షెడ్యూల్ భూభాగంలో అక్రమ నిర్మాణాలు తొలగించి రోడ్డు విస్తరణ చేయాల్సిన బాధ్యత అధికారులదే అని గుర్తు చేశారు. కానీ, కొంతమంది రాజకీయ నేతల ఒత్తిళ్లకు లోనై జిల్లా అధికారులు పనులను నిర్లక్ష్యంగా వదిలేశారని తీవ్రంగా విమర్శించారు. “ఒక్కరోజే పాత బస్టాండ్ వద్ద నిర్మాణాలు తొలగిస్తే, మిగిలిన చోట ఎందుకు ఆలస్యం?” అంటూ ప్రశ్నించిన ఆయన, ఇప్పటికే ఐదు వారాలు గడుస్తున్నా చర్యలు చేపట్టకపోవడాన్ని ఆశ్చర్యకరంగా అభివర్ణించారు.ట్రాఫిక్ సమస్యలు, పార్కింగ్ ఇబ్బందులు ప్రజలు రోజూ ఎదుర్కొంటున్నా, అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదని పేర్కొన్నారు. టీడీపీ నేతల దుకాణాలు కూడా రోడ్డు విస్తరణలో తొలగించాల్సిన అవసరం ఉండడంతో, కొంతమంది ఉన్నతాధికారులు రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గుతున్నారని విమర్శించారు.జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీవో, సబ్ కలెక్టర్ వెంటనే స్పందించి మిగిలిన ఆక్రమణల తొలగింపు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. లేదంటే అభివృద్ధిని కోరుకునే ప్రజలతో కలిసి విపులమైన ప్రజా ఆందోళనకు సిద్ధం అవుతామని హెచ్చరించారు.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర గ్రీవెన్స్ విభాగం కార్యదర్శి గాచింతపల్లి జెడ్పిటిసి

చింతపల్లి పెన్ పవర్ జూన్ 28:- వైఎస్సార్ సీపీ రాష్ట్ర గ్రీవెన్స్ విభాగం కార్యదర్శి గా నియమించిన పార్టీ అధినేత శ్రీ జగన్ మోహన్ రెడ్డి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ఈసందర్భంగా ఆయన స్థానిక మిడియా మిత్రులతో మాట్లాడుతూ పార్టీ అధినేత జగన్ మోహన్ రెడ్డి అతి సామాన్య కార్యకర్త అయిన నన్ను రాష్ట్ర స్థాయి పార్టీ పదవి ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను అన్నారు. నామీద నమ్మకముంచి నాకు ఇచ్చిన ఈ అవకాశాన్ని వమ్ము చేయకుండా పార్టీ అభివృద్ధికి అందరినీ కలుపుకొని సమర్థవంతంగా పనిచేస్తానని అన్నారు. కష్టపడి పనిచేసే నాలాంటి కార్యకర్తలను గుర్తించి ఇంతటి గొప్ప అవకాశం కల్పించిన పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి అలాగే నా అభిమాన నాయకుడు అల్లూరి సీతారామరాజు జిల్లా అధ్యక్షులు శాసన సభ్యులు మత్యరాస విశ్వేశ్వరరాజు కు నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

ఘనంగా వారాహి అమ్మవారి పూజలు

అల్లిపురం పెన్ పవర్ జూన్ 29: అల్లిపురం విద్యాదయ పాఠశాల ప్రక్కన గల సాయి శ్రీమేరు సేవా ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో ఘనంగా శ్రీ వారాహి అమ్మవారి పూజలు నిర్వహిస్తున్నారు. పూజాది కార్యక్రమాల్లో భాగంగా అర్చకులు వేదమంత్రాలతో తొలుత విఘ్నేశ్వరుని పూజను ఆచరించి అనంతరం శ్రీ వారాహి అమ్మవారి సన్నిధిలో కుంకుమార్చనలు , ప్రత్యేక పూజలు , చండీ హెూమం నిర్వహించారు . సామూహికంగా నిర్వహిస్తున్న పూజా కార్యక్రమాలలో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొని కుంకుమార్చనలు చేశారు . వేడుక నిర్వహించిన ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ పి ప్రసన్న , కార్యదర్శి పి శ్రీనివాస సుబ్రహ్మణ్య శాస్త్రి , వైస్ చైర్మన్ గ్రంధి రాజేష్ , ట్రస్టీలు ఏ రామరాజు , ఎన్ ఈశ్వర్ ప్రసాద్ గుప్తా తదితరులు పాల్గొన్నారు .

సామూహిక కుంకుమార్చనలో పాల్గొన మహిళలు

భూగర్భ విద్యుత్ కేబుల్ పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే గణబాబు

గోపాలపట్నం, పెన్ పవర్, జూన్ 28 : ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ వారి ఆధ్వర్యంలో 33 కె.వి, 11 కె.వి, భూగర్భ విద్యుత్ కేబుల్ పనులను ప్రారంభోత్సవం కార్యక్రమాన్ని

ప్రభుత్వ విప్, పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే గణబాబు చేతుల మీదుగా గోపాలపట్నం లక్ష్మీనగర్లో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఈపీడీసీఎల్ ఎస్సీ శాంబాబు, ఏడి,ఏఈ,జీవీఎంసీ.శ్రీనివాస్ ఎస్సీ ఇంజనీరింగ్ సిబ్బంది, 89వ కార్పొరేటర్ దాడి వెంకట రమేష్, 90 కార్పొరేటర్ బొమ్మిడి రమణ, 90,91, 92,89వార్డు అధ్యక్షులు మరియు ముఖ్య నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

అన్నదాన భవనం ప్రదేశాలను పరిశీలించిన ఈవో వేంద్ర త్రినాధరావు

సింహాచలం, పెన్ పవర్, జూన్ 28 : శ్రీ వరాహలక్ష్మీ నరసింహస్వామివారి దేవస్థానం, సింహాచలంలో శనివారం శ్రీ స్వామివారి నిత్య అన్న ప్రసాదం భవనం ప్రదేశాలను ఆలయ కార్యనిర్వహణాధికారి వేంద్ర త్రినాధరావు, ఆలయ సహాయ కార్యనిర్వాహణాధికారులు వాద్రేవు రమణమూర్తి, నక్కాన ఆనంద్ కుమార్, పిల్లా శ్రీనివాసరావు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డివిఎస్ రామరాజు, అసిస్టెంట్ ఇంజనీర్ లోకేష్ వారి బృందంతో కలిసి పలు ప్రాంతాలను పరిశీలించారు. క్యూ లైన్లలో భక్తులు ఏ విధమైన అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దేవస్థానంకు వచ్చే భక్తులకు మరింత నాణ్యత కూడిన స్వామివారి నిత్య అన్నప్రసాదం అందించాలని, నాణ్యత ప్రమాణాలు తూచా తప్పకుండా పాటించాలని, ఆలయ ఈవో ఆదేశించారు. ప్రసాదాల తయారీ ప్రదేశం ఇరుకుగా ఉండడాన్ని గమనించారు. శనివారం ఆయన ప్రసాదాల తయారీ కొరకు నూతనంగా భవనం నిర్మించేందుకు స్థల పరిశీలన చేశారు. వివిధ అభివృద్ధి పనులపై సహాయ ఏఈఓ లు, ఇంజనీరింగ్ అధికారులతో చర్చించారు. అన్న ప్రసాద భవనం వంటశాలలోని సిబ్బంది పని తీరును గమనించారు. భక్తులతో మర్యాదగా ప్రవర్తించాలని సిబ్బందికి సూచించారు.

ఇండోర్ స్టేడియంలో క్రీడా సౌకర్యాలు

గాజువాక: పెన్ పవర్,జూన్ 28 జీవీఎంసీ 65 వ వార్డు,వికాస్ నగర్ రాజీవ్ ఇండోర్ స్టేడియంలో ఇటీవల రూ.9 కోట్లతో ఆధునీకరించిన సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. స్టేడియంలో షటిల్ కోర్టులు, వ్యాయామశాల,ఈత కొలను,యోగా కేంద్ర%శీ% క్రీడాకారులతో సందడి వాతావరణం నెలకొంది . శాంతి యోగ శిక్షణ తరగతులను వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహ పాత్రుడు శనివారం ప్రారంభించారు. జాతీయ యోగాసన రిఫరీ సీహెచ్ శ్రీనివాస్ పర్యవేక్షణలో ఆసనాలు వేశారు. ఈ సందర్భంగా నరసింహ పాత్రుడు మాట్లాడుతూ గాజువాక నియోజకవర్గ క్రీడాకారుల కోసం కోట్లాది రూపాయలు వెచ్చించి సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. ఈ విషయంలో ఎమ్మెల్యే,తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు,మేయర్ పీలా శ్రీనివాస్,డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరాజు అందించిన సహకారం క్రీడాకారుల్లో చైతన్యాన్ని నింపింది అన్నారు. క్రీడాకారులకు అవసరమైన అన్ని సదుపాయాలు ఇక్కడ సమకూర్చినట్లు తెలిపారు. ఈత కొలనును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మరో కార్పొరేటర్లు పల్లా శ్రీనివాస్,ఉరుకూటి చందు,కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ స్వామి వారిని దర్శించుకున్న గృహ నిర్మాణశాఖ మంత్రి పార్థసారథి

సింహాచలం, పెన్ పవర్, జూన్ 28 : శ్రీ వరహాలక్ష్మీ నరసింహస్వామివారి దేవస్థానం, సింహాచలం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి కె పార్థసారథి శ్రీ స్వామివారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ కార్యనిర్వహణాధికారి వేంద్ర త్రినాధరావు వారి ఆదేశాలతో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సింగం రాధా, సహాయ కార్యనిర్వహణ అధికారులు ఆనందకుమార్, రమణమూర్తి, ఆలయ ప్రధాన అర్చకులు వేద పండితులు నాదస్వర వేదమంత్రాలతో స్వాగతం పలికారు. ముందుగా స్వామివారి కప్ప స్తంభము ఆలింగనం చేసుకున్నారు. ఆ తదుపరి నాదస్వరలతో వేదమంత్రాలతో బేడా మండపము ప్రదక్షిణ కావించి స్వామివారి అంతరాలయ దర్శనం అనంతరము వేద పండితులచే వేద ఆశీర్వచనమిచ్చి ఆలయ సహాయ కార్య నిర్వహణ ఆనంద్ కుమార్ స్వామివారి చిత్రపటం ప్రసాదాలను బహుకరించారు.

సీడ్ బాల్ విద్యార్థులను ప్రశంసించిన ఎమ్మెల్యే గణబాబు

గోపాలపట్నం, పెన్ పవర్, జూన్ 28 : స్థానిక జిల్లా పరిషత్ బాల బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులచే 20వేల సీడ్ బాల్ తయారీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్,పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే పెతకంశెట్టి గణబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసే విధానం చూసి ప్రశంసించారు. విద్యార్థులతో తయారు చేయబడ్డ కొండ ప్రాంతాల్లోని, నది ఒడ్డున, మైదాన ప్రాంతాల్లో సీడ్ బాల్ ని డ్రోన్ సహాయంతో వేయడం జరుగుతుంది. ఫౌండేషన్ తరపున లక్ష సీడ్ బాల్స్ ని తయారీ చేయాలన్న లక్ష్యంతో ముందుకెళ్తున్నామని నిర్వాహకులు తెలిపారు.

దేశం సస్యశ్యామలంగా ఉండాలని వైకుంఠవాసునికి వరదపాయసం

సింహాచలం, పెన్ పవర్, జూన్ 28 : శ్రీవరాహ లక్ష్మీ నృసింహస్వామివారి దేవస్థానం, సింహాచలం, శ్రీ స్వామివారి కొండపైన ఉత్తరాన ఉన్న పర్వత శిఖరాన వెలసిన శ్రీవైకుంఠవాసుల మెట్ట మీద గల శ్రీ వైకుంఠ వాసునికి దేశంలో సంవృద్ధిగా వర్షాలు పడాలని, తద్వారా పంటల పండి, చెరువులు, బావులు నిండి, పుష్కలముగా భూగర్భ, జలలుతో దేశం సస్యశ్యామలంగా ఉండాలని, సింహాచలం కొండపైన వైకుంఠ నారాయణునకు వరద పాయసం పోయడం అనదిగా జరుగుచున్నది. సాంప్రదాయ ఆచారము సాంప్రదాయము ప్రకారము 2025 జూన్ 29, ఆదివారం నాడు వైకుంఠవాసునికి వరదపాయసం పోయాలని వైదిక వర్గాలు నిర్ణయించుట జరిగింది. ఆ ప్రకారము తేది 29న ఉదయం సుమారు 8.00ల నుండి విశ్వక్సేన పూజ, పుణ్యాహావాచనము, పంచకలస స్నపన పూర్వక అభిషేకము, విరాటపర్వం పారాయణం వరుణ మంత్రజపము, పాయస నివేదన వరదపాయసం వైకుంఠవాసుని వద్ద గల బండ పై పోయుట మొదలగు కార్యక్రమములు జరుగును. కావున 29 ఆదివారం స్వామివారికి జరగవలసిన ఆర్థిక సేవలు రద్దు చేయబడును భక్తులు గమనించగలరు.

గెస్ట్ లెక్చరర్స్ పోస్టుల భర్తీకై దరఖాస్తులు ఆహ్వానం

కళాశాల ప్రిన్సిపల్ డా. కర్రి సుధ ప్రకటన

కొయ్యూరు, పెన్ పవర్ జూన్ 28: మండలంలోని మర్రిపాలెం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్స్ పోస్టుల భర్తీకై అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. కర్రి సుధ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో మ్యాథ్స్, జువాలజీ, ఎకనామిక్స్, మరియు కంప్యూటర్ లెక్చరర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్టు వివరించారు. వీటికై ఎంఏ, ఎమ్మెస్సీ పూర్తి చేసిన అభ్యర్థుల అర్హులను వివరించారు. ఎన్ ఇ టి, ఎస్ ఇ టి, పీహెచ్డీ అర్హత కలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడుతుందని వివరించారు. అర్హత కలిగిన అభ్యర్థులు తమ బయోడేటాలను జులై 2వ తేదీ కల్లా కళాశాలలో స్వయంగా అందించాలని ప్రిన్సిపల్ కోరారు.

అంగరంగ వైభముగా స్వామివారి నిత్య కల్యాణం



సింహాచలం, పెన్ పవర్, జూన్ 28 : ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం ప్రముఖ పుణ్యక్షేత్రముగా విరాజిల్లుతున్న సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి వారి నిత్య కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. ఆర్జిత సేవల్లో భాగంగా అర్చక స్వాములు ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో మండపంలో అధిష్టింపజేశారు. నిత్య కళ్యాణములో పాల్గొన్న భక్తుల, గోత్రనామాలతో సంకల్పం చెప్పి పాంచరాత్రాగమశాస్త్రం విధానంలో విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలతో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కంకణధారణ, నూతన యజ్ఞోపవీత సమర్పణ, జీలకర్ర, బెల్లం, మాంగళ్య ధారణ, తలంబ్రాల ప్రక్రియలను కమనీయంగా జరిపించారు. మంత్రపుష్పం, మంగళాశాసనాల తర్వాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, స్వామివారి ప్రసాదాలను అందజేశారు. అనంతరముస్వామివారి అంతరాలయ దర్శనం కల్పించారు.

నలుగురు ఎఎస్సైలకు ఎస్సైలగా ప్రమోషన్స్ కల్పించిన విశాఖ డీఐజీ

విశాఖపట్నం, పెన్ పవర్, జూన్ 28 : స్థానిక విశాఖ రేంజ్ పరిధిలో నలుగురు ఎఎస్సైలకు ఎస్సైలగా ప్రమోషన్స్ కల్పిస్తూ విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి జూన్ 28న ఉత్తర్వులు జారీ చేశారు. ప్రమోషన్స్ పొందిన వారిలో (1) బి.సురేష్ ను పార్వతీపురం మన్యం జిల్లాకు కేటాయించగా (2) డి.సత్యారావును శ్రీకాకుళం జిల్లాకు కేటాయించారు. (3) కి.శ్రీనివాసరావు (4) సర్దార్ ఖాన్ లను విజయనగరం జిల్లాకు కేటాయిస్తూ డీఐజీ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రమోషన్స్ పొందిన ఏఎస్ఐలను రేంజ్ డిసీజీ అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు. ఎస్సైగా ఉద్యోగొన్నతి వారిలో భోగాపురం పోలీసు స్టేషన్ నందు ఏఎస్ఐగా పని చేస్తున్న సర్దార్ ఖాన్ కూడా ఉన్నారు. ప్రమోషన్ పొందిన సర్దార్ ఖాన్ జూన్ 28న డీఐజీ గోపీనాథ్ జట్టిని, రేంజ్ పోలీసు కార్యాలయంలో కలవగా, ఆయన అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు. ఎస్ఐ సర్దార్ ఖాన్ ఈ నెల 30న ఉద్యోగ విరమణ చేయనుండడంతో విజయనగరం జిల్లాకు కేటాయిస్తూ, జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ వద్ద రిపోర్టు చేయాల్సిందిగా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 1982 సం.లో పోలీసుశాఖలో కానిస్టేబుల్ గా విధుల్లో చేరిన సర్దార్ ఖాన్, 2009 సం.లో ఏఎస్సై గాను, 2025 సం.లో ఎస్సై గా ప్రమోషన్స్ పొందారు.

నేత్రపర్వంగా శ్రీ స్వామివారి సహస్రనామార్చన

సింహాచలం, పెన్ పవర్, జూన్ 28 : శ్రీ వరాహలక్ష్మీ నృసింహస్వామివారి సహస్రనామార్చన నేత్రపర్వంగా సాగింది. ఆర్జిత సేవల్లో భాగంగా ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో మండపం లో అధిష్టింపజేశారు. సహస్రనామార్చనలో పాల్గొన్న భక్తుల, గోత్రనామాలతో సంకల్పం చెప్పి, పాంచరాత్రాగమశాస్త్రం విధానంలో విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలతో కార్యక్రమానికి కమనీయంగా జరిపించారు. మంత్రపుష్పం, మంగళాశాసనాల తర్వాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, స్వామివారి ప్రసాదాలను అందజేశారు. తదుపరి స్వామివారి అంతరాలయ దర్శనమునకు అనుమతించారు.

బనకచర్ల-కు క్లాప్ కొట్టేది ఎప్పుడు బాబూ?

- **వైయస్ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి సూటి ప్రశ్న**

అన్నమయ్య జిల్లా: పెన్ పవర్, జూన్ 28 డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగా బనకచర్ల అనే కొత్త సినిమాను తెరపైకి తెచ్చిన చంద్రబాబు..ఈ సినిమాకు క్లాప్ కొట్టేది ఎప్పుడని వైయస్ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి సూటిగా ప్రశ్నించారు. బనకచర్ల తో గేమ్ చేంజర్ అంటూ చంద్రబాబు ఊదరగొడుతున్నాడని ఆయన మండిపడ్డారు. శనివారం రాయచోటిలో శ్రీకాంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.- రాష్ట్రంపై లక్షల కోట్లు అప్పులు చేస్తున్న చంద్రబాబు పాలనను గాలికొదిలేసి కమీషన్లు, అవినీతి దందాలు చేసి స్వంత లాభం కోసం కేవలం అమరావతి కోసం ఖర్చు పెడుతున్నారు. బనకచర్ల అనే కోత్త సినిమా చూపిస్తానంటున్నావ్? .దానికి క్లాప్ ఎప్పుడు కోట్టేది లేదు. ఆ సినిమా హిట్ అయ్యేది లేదు? రాయలసీమ ప్రజలను ఉరించడానికే బనకచర్ల జపం చేస్తున్నారు. 83 వేల కోట్లు కాదు గడికోట రిజర్వాయర్ నుంచి కాలేటి వాగు మీదుగా చేపట్టిన ప్రాజక్టు ద్వారా ప్రతి ఇంటికి కులాయి పథకాన్ని మేము ప్రారంభిస్తే ఇప్పటి వరకు ఈ ప్రభుత్వం దానిని ముందుకు తీసుకెళ్ళలేదు. రాష్ట్రానికి రాజధాని అవసరమే, అమరావతి కి మేము వ్యతిరేకం కాదు. మిగిలిన ప్రాంతాలను గాలికోదిలేయడాన్ని ప్రశ్నిస్తున్నాం. అమరావతి పేరుతో లక్షల కోట్లు దోచుకోంటున్నారు, వాటిని నిలదీస్తున్నాం. అప్పేమో రాష్ట్రం మొత్తం మీద, అభివృద్ధి కేవలం అమరావతి మీదా? ఇదెకడి న్యాయం%-% అంటూ గడికోట శ్రీకాంత్‌రెడ్డి ప్రశ్నించారు.

పెద్దారెడ్డిపై కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు

మాజీ ఎమ్మెల్యే ఇంటి కూల్చివేతకు కూటమి కుట్ర!

అనంతపురం: పెన్ పవర్, జూన్ 28 వైయస్ఆర్‌సీపీ నేత, తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిపై కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్య కొనసాగుతోంది. ఇప్పటికే ఆయనను తాడిపత్రిలో అడుగుపెట్టకుండా అడ్డుకుంటున్న కూటమి నేతలు.. తాజాగా ఆయన ఇంటిని టార్గెట్ చేసినట్టు తెలుస్తోంది. పెద్దారెడ్డి ఇంటి వద్ద తాజాగా మున్సిపల్ శాఖ అధికారులు కొలతలు తీసుకోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

హైకోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ..

తాడిపత్రిలో మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిపై కూటమి కక్ష సాధింపు పీక్ స్టేజ్‌కు చేరుకుంది. పెద్దారెడ్డిని టార్గెట్ చేసి అధికారులు, టీడీపీ నేతలు రాజీకీయంగా వేధింపులకు గురిచేస్తున్నారు. హైకోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ స్థానిక టీడీపీ నేతలు, పోలీసులు.. ఇప్పటికీ ఆయనను తాడిపత్రిలో అడుగుపెట్టనివ్వడం లేదు. ఇక, తాజాగా తాడిపత్రిలో మున్సిపల్ అధికారులు తనిఖీలు అనుమానాలకు తావిస్తున్నాయి.

ఈరోజు పెద్దారెడ్డి ఇంటి వద్దకు వెళ్లిన అధికారులు.. అక్కడ టేపుతో కొలతలు తీసుకున్నారు. ఇంటి ముందు, పరిసరాల్లో కొలతలు చేపట్టారు. అయితే, మున్సిపల్ స్థలం ఆక్రమించారనే ఫిర్యాదు మేరకు తాము కొలతలు చేపట్టినట్టు అధికారులు చెప్పారు. అయితే, వారి మాటలకు చేతలకు పొంతన కనిపించలేదు. దీంతో, స్థానిక వైయస్ఆర్‌సీపీ నేతలు, ప్రజలు మాత్రం పెద్దారెడ్డి ఇంటిని కూల్చివేసేందుకు కుట్రలు చేస్తున్నట్టు ఆరోపిస్తున్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రథమ చికిత్సకు అవసరమయ్యే మందులు, వైద్య పరీక్షలు సిద్ధంగా ఉంచాలి...

ఎన్సీడీ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ జగన్ మోహనరావు

కురుపాం / సీతానగరం, పెన్ పవర్, జూన్ - 28 : ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అత్యవసర సమయాల్లో ప్రథమ చికిత్సకు అవసరమయ్యే మందులు, వైద్య పరీక్షలు సిద్ధంగా ఉంచాలని ఎన్సీడీ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి. జగన్ మోహనరావు సూచించారు. ఈ మేరకు సీతానగరం పిహెచ్సీని శనివారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముఖ్యంగా సాయంత్రం రాత్రివేళలో ఎటువంటి ఆరోగ్య సమస్యలతో ఆరోగ్య కేంద్రానికి వస్తున్నారు వారికి అందజేస్తున్న చికిత్సా వివరాలు ఓపి రికార్డులో పరిశీలించారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ఉన్నందున అవసరమైన నిర్ధారణ పరీక్షలు పరీక్షలు,మందులు తో పాటుగా కుక్కకాటు,పాముకాటు ఇంజక్షన్ల లభ్యత పై పరిశీలించారు. ప్రధాన రహదారికి సమీపాన పిహెచ్సీ ఉన్నందున ఆర్టిఏ కేసులు వచ్చే అవకాశం ఉన్నందున ప్రథమ చికిత్స కిట్టు ను ఆస్పత్రిలో సిద్ధంగా ఉంచాలన్నారు పీహెచ్సీలో ఇన్వెర్టర్ బ్యాటరీ పనితీరును గమనించారు. ఆసుపత్రిలో సిబ్బంది అన్నివేళలా అందుబాటులో ఉంటూ వైద్యం దృష్ట్యా రోగులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

చంద్రబాబు పాలనలో తిరోగమనంలో పారిశ్రామిక రంగం

- రాష్ట్రానికి కొత్త పరిశ్రమలు రావు... ఉన్న వాటిని తరిమేస్తున్నారు
- మండిపడ్డ వైయస్ఆర్‌సీపీ నాయకుడు పోతిన వెంకట మహేష్
- తాడేపల్లి వైయస్ఆర్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు పోతిన వెంకట మహేష్
- వైయస్ జగన్ హయాంలోనే పారిశ్రామిక ప్రగతి
- పెద్ద ఎత్తున రాష్ట్రానికి పెట్టుబడులు తెచ్చారు
- లక్షల సంఖ్యలో ఉద్యోగాలు కల్పించారు
- నేడు వాటిని నిస్సిగ్గుగా తన ఘనత అని చంద్రబాబు చెప్పుకుంటున్నారు
- వైయస్ఆర్‌సీపీ నాయకుడు పోతిన వెంకట మహేష్ ఆగ్రహం

తాడేపల్లి: పెన్ పవర్, జూన్ 28:ఏడాది కాలంగా చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంలో పారిశ్రామికరంగం తిరోగమనంలో ఉందని వైయస్ఆర్‌సీపీ నాయకుడు, గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు పోతిన వెంకట మహేష్ మండిపడ్డారు. తాడేపల్లి వైయస్ఆర్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రానికి పెట్టుబడులను తీసుకురాలేక, గతంలో వైయస్ జగన్ హయాంలో సాధించిన ప్రగతిని నిస్సిగ్గుగా తన ఖాతాలో వేసుకునేందుకు చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముడుపుల కోసం పరిశ్రమలపై కూటమి నేతల రౌడీయిజం కారణంగా కొత్త పరిశ్రమలు రాకపోవడంతో పాటు, ఇప్పటికే ఉన్న పరిశ్రమలు కూడా రాష్ట్రం నుంచి పారిపోతున్నాయని ధ్వజమెత్తారు.

ఇంకా ఆయనేమన్నారంటే....

ప్రతిసారీ చంద్రబాబు తన మేనిఫేస్టోలో అబద్దాలే చెప్పుకుంటూ వస్తున్నారు. చంద్రబాబు గతం, వర్తమానం, భవిష్యత్తు అంతా ఒక అబద్ధం. 1999 ఎన్నికల ప్రచారంలో ఇదే చంద్రబాబు కోటి ఉద్యోగాలు కల్పిస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. వాటిల్లో కనీసం లక్ష ఉద్యోగాలు అయినా కల్పించారా? ఆయనకు దమ్ముంటే వెల్లడించాలి. అలాగే 2014-19 మధ్య 25 లక్షల ఉద్యోగాలు, 10 లక్షల కోట్ల పెట్టుబడులు, ఉద్యోగాలు కల్పించకుంటే నిరుద్యోగభృతి కింద ఒక్కో నిరుద్యోగికి నెలకు రూ.2000 ఇస్తానని హామీ ఇచ్చారు. వీటిల్లో ఏ ఒక్కటీ అమలు చేయలేదు. అలాగే 2024లో ఏకంగా అయిదేళ్ళలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తానని, లక్షల కోట్ల విలువైన పెట్టుబడులు తీసుకువస్తానని, నిరుద్యోగులకు నెలకు రూ.3000 చొప్పున నిరుద్యోగభృతి ఇస్తానంటూ గొప్పగా వాగ్ధానాలు చేసి యువతను నమ్మించారు. ఏడాది కాలంగా ఈ మూడింటిల్లో ఏ ఒక్కటైనా ముందుకు తీసుకువెళుతున్నారా?

1.50 కోట్ల మంది నిరుద్యోగులకు న్యాయం చేయండి

అధికారంలోకి వచ్చిన తరువాత చంద్రబాబు గత ఏడాది నిరుద్యోగభృతిని ఎగ్గొట్టేశారు. చంద్రబాబుకు నిత్యం భజనచేసే ఈనాడు పత్రికలోనే రాష్ట్రంలో 1.50 కోట్ల మంది నిరుద్యోగులు ఉన్నారని, వారంతా ఉపాధి కోసం ఎదురుచూస్తున్నారని రాశారు. ఏ జిల్లాలో ఎంత మంది ఉన్నారో కూడా వివరాలు వెల్లడించారు. మరి వీరందరికీ ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు ఏ మేరకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారో చెప్పాలి. మాయమాటలు చెప్పడం, గిమ్మిక్కులతో రాజకీయం చేయడం, రాని పెట్టుబడులు పెద్ద ఎత్తున రాష్ట్రానికి వచ్చేసినట్లు ప్రజలను ఎప్పటికప్పుడు మభ్యపెడుతూ పబ్బం గడుపుతున్నారు. ట్రెండింగ్‌లో ఉన్న నాలుగు మాటలు గుర్తు పెట్టుకుని వాటిని పదేపదే చెబుతూ తానో విజనరరీని అని చాటుకుంటూ ఉంటారు. సెల్‌ఫోన్‌ను తానే కనిపెట్టాను అని, ఐటీకి తానే ఆద్యుడినని, ఏకంగా హైదరాబాద్‌ను తానే నిర్మించానంటూ నిస్సిగ్గుగా అబద్దాలను గొప్పగా చెప్పుకుంటారు. ఇవన్నీ నిజమేనంటూ ఆయనకు బాకా ఊదే ఎల్లో మీడియా దానిపై పుంఖానుపుంఖాలుగా కథనాలు రాస్తోంది.

వైయస్ జగన్ హయాంలో పెట్టుబడుల వెల్లువ

వైయస్ జగన్ సీఎంగా ఉన్నప్పుడు తీసుకువచ్చిన అనేక కంపెనీలను, రూ.లక్షల కోట్ల విలువైన పెట్టుబడులను తానే తీసుకువచ్చినట్లు చంద్రబాబు బిల్డప్ ఇస్తున్నాడు. దావోస్‌కు వెళ్లి చంద్రబాబు, లోకేష్‌లు ఉత్తి చేతులతో తిరిగి వచ్చిన మాట వాస్తవం కాదా? ఒక్క రూపాయి అయినా వారిని నమ్మి ఏపీలో పెట్టుబడి పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు వచ్చారా? జగన్ గారి హయాంలోనే 2023లో ఎన్‌టీపీసీ తొలిసారిగా 1.10 లక్షల కోట్ల రూపాయలతో గ్రీన్ ఎనర్జీ యూనిట్‌ను ఏపీలో ఏర్పాటు చేసుకునేందుకు విశాఖ గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌లో ఒప్పందం చేసుకుంది. దానికి అన్ని అనుమతులు, భూబదలాయింపులు కూడా వైయస్ జగన్ ప్రభుత్వంలోనే జరిగాయి. అలాగే గ్రీన్ ఎనర్జీ రంగంలో వైయస్ జగన్ రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకువచ్చారు. కాకినాడలో గ్రీన్‌కో, షిర్డీసాయి ఎలక్ట్రికల్స్ తో ఒప్పందాలు చేసుకున్నారు. అలాగే దావోస్ లో వైయస్ జగన్ పర్యటనలో ఆర్సల్ మిట్టల్ గ్రూప్ ద్వారా అనకాపల్లిలో స్టీల్ ప్లాంట్‌ను తీసుకువచ్చారు. కానీ చంద్రబాబు వీటన్నింటినీ తానే సాధించినట్లు గొప్పలు చెప్పుకుంటున్నారు. వైయస్ జగన్ ప్రభుత్వంలో అశోక్ లేలాండ్ ఏపీలో 2021లో ఉత్పత్తి ప్రారంభించామని, స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో లిస్టింగ్ అయినట్లుగా వారు చెబుతుంటే, దానిని లోకేష్ 2025లో ప్రారంభించినట్లుగా ప్రచారం చేసుకుంటున్నారు. రూ. 3079 కోట్లతో ఏటీసీ టైర్స్ 2020లో ఆమోదముద్రపడి, 2021లో పనులు ప్రారంభించి, 2022లో దీనిని సీఎంగా వైయస్ జగన్ ప్రారంభించారు. అలాగే శ్రీసిటిలో డైకిన్ సంస్థ 2022లోనే ఉత్పత్తి ప్రారంభించారు. సత్యసాయి జిల్లాలో భారత్ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ రక్షణ పరికరాల తయారీకి ఒప్పందం చేసుకుంది వైయస్ జగన్ ప్రభుత్వంలోనే. దక్కన్ ఫైన్ కెమికల్స్ కూడా వైయస్ జగన్ గారి హయాంలోనే వచ్చింది. పియుఆర్ ఎనర్జి ప్రైవేటు లిమిటెడ్, జూపిటర్ రెన్యూవల్ ,బ్లూజెట్ హెల్త్‌కేర్ లిమిటెడ్, రామభద్రా, మోహన్ స్పిన్ టెక్స్, విన్‌టెక్ మోబైల్ కమ్యూనికేషన్స్, నితిన్‌సాయి కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేటు లిమిటెడ్, దేశ్ రాజ్ సోలార్, ఎంప్లాస్ ఎనర్జీ లిమిటెడ్, వరుణ్ హాస్పటాలిటీ ఇలా వేల కోట్ల రూపాయల పెట్టుబడులు, లక్షల ఉద్యోగాలు వైయస్ జగన్ హయాంలోనే వచ్చాయి. వీటిపై కూటమి ప్రభుత్వంతో బహిరంగ చర్చకు సిద్దం. ఇటీవల జూన్ 23న ఇచ్చిన ఒక ప్రజెంటేషన్‌లో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ రూ.9.03 లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చినట్లు, 8.5 లక్షల ఉద్యోగాలను కల్పించినట్లుగా చెప్పుకున్నారు. ఇవన్నీ గత ప్రభుత్వంలో వైయస్ జగన్ చొరవతో వచ్చినవి అని నిజం చెప్పే ధైర్యం చంద్రబాబుకు లేదు. స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డులో కొన్ని మార్పులు చేసి, ఈ మొత్తం క్రెడిట్ అంతా నాదేనని ప్రచారం చేసుకుంటున్నారు. వేరే వారు చేసిన కృషిని తన ఖాతాలో వేసుకుంటున్నారు.

రెడ్‌బుక్ రాజ్యాంగంతో పారిశ్రామికవేత్తలు బెంబేలు

రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ, పారిశ్రామికవేత్తలపై వాటాలు, కమిషన్లు, ముడుపుల కోసం దాడులు చేస్తుండటంతో వారంతా రాష్ట్రం వదిలి పారిపోతున్న విషయం నిజం కాదా? రాష్ట్రంలో భయానక వాతావరణంలో చంద్రబాబు, లోకేష్‌లను చూసి ఎవరైనా పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తారా? ఈ రాష్ట్రంలోని అన్ని పరిశ్రమలు వారి కాంట్రాక్ట్‌లను ఖచ్చితంగా కూటమి నేతలకే ఇవ్వాలనే బెదిరింపులతో వారంతా రాష్ట్రం వదలి పారిపోతున్నారు. వైయస్ జగన్‌పై ఉన్న కక్షతో ప్రముఖ అంతర్జాతీయ సిమెంట్ కంపెనీ వికాట్‌లో పూర్తిస్థాయి డైరెక్టర్‌గా ఉన్న బాలాజీ గోవిందప్పను లేని లిక్కర్ స్కామ్‌లో ఇరికించారు. 165 సంవత్సరాల చరిత్ర ఉన్న ఈ వికాట్ కంపెనీకి భారతీ సిమెంట్స్‌లో యాభైఒక్క శాతం వాటా ఉందనే దుగ్ధతోనే గోవిందప్పపై అక్రమ కేసులు బనాయించి, జైలుకు పంపారు. ఈ రాష్ట్ర ప్రభుత్వంతో సంబంధం లేని వ్యక్తులను ఇలా తప్పుడు కేసుల్లో ఇరికిస్తుంటే ఇక ఏ పారిశ్రామికవేత్త ఈ రాష్ట్రానికి వస్తారు? ప్రముఖ పారిశ్రామికవేత్త సజ్జన్ జిందాల్ పై ఇలానే వేధింపులకు పాల్పడటంతో ఆయన మన రాష్ట్రం నుంచి వెళ్ళిపోయి, మహారాష్ట్రంలో రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టారు. అల్ట్రాసిమెంట్స్ ప్లాంట్‌పై తాడిపత్రిలో బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి దాడులు చేసి భయోత్పాతం సృష్టించిన మాట వాస్తవం కాదా? గండికోట రిజర్వాయర్‌పై నిర్మిస్తున్న ఆదానీ హైడ్రో పవర్ ప్రాజెక్ట్‌పై ఆదినారాయణరెడ్డి అనుచరులు దాడులకు పాల్పడ్డారు. పల్నాడులో టీడీపీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు స్థానికంగా ఉన్న భవ్య, అంజనీ సిమెంట్స్ ప్లాంట్‌లపై దాడులు చేసి, ముడుపులు డిమాండ్ చేయడంతో ఆ ప్లాంట్‌లు మూతపడ్డాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత శ్రీకాకుళంలోని యూబీ బీర్ల ప్లాంట్‌పై బీజేపీ ఎమ్మెల్యే తనకు ప్రతి లారీకి వెయ్యి రూపాయలు ఇవ్వాలంటూ డిమాండ్ చేసి, రౌడీయిజం చేసిన మాట వాస్తవం కాదా? జాతీయ రహదారుల ప్రాజెక్ట్‌ల కోసం ఎంపీ సీఎం రమేష్, ఆదినారాయణరెడ్డి వర్గీయులు కర్రలు, రాళ్ళతో నడిరోడ్డుపై దాడులు చేసుకున్నారు. దాల్మియా, మైహెూం సిమెంట్స్ ప్లాంట్‌లపై అనేక వేధింపులకు పాల్పడ్డారు. తాడేపత్రిలో సిమెంట్ కంపెనీకి ఫ్లైయాష్ సరఫరా కోసం జేపీ ప్రభాకర్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డిలు పోటీపడి పరస్పరం దాడులకు సిద్దమైతే, దానిని పంచాయతీ చేసింది సీఎం చంద్రబాఉబ కాదా? కృష్ణపట్నం పోర్ట్ సెక్యూరిటీ మీద టీడీపీ ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తనకు వాటాలు ఇవ్వడం లేదని దాడులకు పాల్పడ్డారు. కాకినాడ పోర్ట్‌పై టీడీపీ సానుభూపరుడు కేవీ రావుతో అరబిందో ఫార్మాపై తప్పుడు కేసులు పెట్టి, శరత్చంద్రారెడ్డిపై వేధింపులకు పాల్పడ్డారు. రామాయపట్నం పోర్ట్‌లో వాటాలు ఇవ్వలేదని పోర్ట్‌కు వెళ్లే మెటీరియల్‌ను కందుకూరి టీడీపీ ఎమ్మెల్యే అడ్డుకోవడం నిజం కాదా?ఈ పంచాయతీ కూడా సీఎం కార్యాలయానికికే వచ్చింది. సత్తెనపల్లిలో షాడో ఎమ్మెల్యేగా పనిచేస్తున్న టీడీపీ నేత గ్రానైట్ రవాణా కోసం బలవంతంగా ముడుపులు వసూలు చేస్తున్నారు. శ్రీకాకుళంలో ఎమ్మెల్యే నడికుదిటి ఈశ్వరరావు తనకు ముడుపులు ఇవ్వని కంపెనీలను 'సీజ్ ద కంపెనీ' అంటూ బెదిరిస్తున్నారనేది బహిరంగ రహస్యం. ఇలాంటి వ్యవహారాలు చేస్తుంటే ఏ విధంగా ఏపీకి పెట్టుబడులు వున్నాయో చంద్రబాబు చెప్పాలి.

ఉద్యోగాల కల్పన ముసుగులో బినామీలకు రూ.వేల కోట్ల భూమి

ఉద్యోగాల కల్పన చేస్తామని చంద్రబాబు విలువైన భూములను తమ బినామీ కంపెనీలకు దారాదత్తం చేస్తున్నారు. విశాఖపట్నంలో ఎకరం రూ.50 కోట్ల విలువైన భూములను అడ్రస్ లేని కంపెనీలకు కట్టబెడుతున్నారు. ఆ భూములను ఏకరం 99 పైసలకే ఇచ్చేస్తున్నారు. ఆర్థిక రాజధానిగా ఉన్న విశాఖపట్నంలోని విలువైన భూములను ఎవరి ప్రయోజనాల కోసం ఇస్తున్నారో చెప్పాలి. లీజులకు భూములు ఇచ్చే అవకాశం ఉన్నా కూడా, అతి తక్కువకు ప్రైవేటు కంపెనీలకు ఏకంగా అన్ని హాక్కులతో అమ్మేస్తున్నారు. దీని వెనుక ఉన్న మతలబు ఏమిటీ? ప్రముఖ కంపెనీలను ముందు పెట్టి, బోగస్ కంపెనీలకు పెద్ద ఎత్తున భూములను అప్పగిస్తున్నారు. విశాఖలో టీసీఎస్‌కు రూ.1058 కోట్ల విలువైన భూములు ఇస్తున్నారు. దానికి గానూ వారు పెట్టే పెట్టుబడి ఎంత అంటే రూ.1370 కోట్లు. అంటే ఒక్కో ఉద్యోగంకు ప్రభుత్వం చేస్తున్న ఖర్చు రూ.8.75 లక్షలు. అలాగే ఉర్సా క్లస్టర్ అనే పేరూ, ఊరు లేని ఒక బోకస్ కంపెనీ రూ.5000 కోట్లు పెట్టుబడి పెట్టి, 2500 ఉద్యోగాలు కల్పిస్తానంటే, ఆ కంపెనీకి ప్రభుత్వం ఇస్తున్న భూమి విలువ రూ.3000 కోట్లు. ఈ లెక్కన ఒక్కో ఉద్యోగంకు ప్రభుత్వం చేస్తున్న వ్యయం రూ.1.20 కోట్లు. కాగ్నిజెంట్ పెట్టుబడి రూ.1583 కోట్లు, వారు కల్పించే ఉద్యోగాలు 8వేలు, కానీ కూటమి ప్రభుత్వం వారికి ఇస్తున్న భూమి విలువ రూ.1050 కోట్లు. అంటే ఒక్కో ఉద్యోగానికి ప్రభుత్వం ఖర్చు చేస్తున్నది రూ.13.12 లక్షలు. అలాగే విశాఖలోనే లులూ సంస్థకు 99 ఏళ్ళ లీజుకు ఎకరానికి ఏడాదికి రూ.50 లక్షలు చెల్లించేలా రూ.2000 కోట్ల విలువైన భూమిని ఇస్తోంది. ఆసంస్థ పెట్టే పెట్టుబడి రూ.2200 కోట్లు, వారు కల్పించే ఉద్యోగాలు 7,000. ఇందుకోసం రూ.170 కోట్లు రాయితీల రూపంలో కూడా ఆ సంస్థకు లబ్ధి చేకూరుస్తోంది. అంటే ఒక్కో ఉద్యోగానికి ప్రభుత్వం చేస్తున్న ఖర్చు రూ.28.57 లక్షలు. దీనిని బట్టి చూస్తే చంద్రబాబు రాష్ట్రంలో ఉద్యోగాలు కల్పించాలి, పెట్టుబడులను ఆకర్షించాలనే ముసుగులో తన బినామీలకు వేల కోట్ల విలువైన భూములను దారాదత్తం చేసి, దాని ద్వారా తాను లబ్ధి పొందాలన్నదే లక్ష్యంగా కనిపిస్తోంది.

నెట్ ప్రాక్టీసుకు బుమ్రా హాజరు...

రెండో టెస్టు ఆడతాడా?

- రెండో టెస్టుకు ముందు టీమిండియా ప్రాక్టీస్‌లో చేరిన జస్ప్రీత్ బుమ్రా
- శనివారం నెట్స్‌లో తీవ్రంగా బౌలింగ్ చేసిన బుమ్రా, ప్రసిద్ధ్, సిరాజ్
- హెడింగ్లీలో ఓటమి తర్వాత జట్టులో పెరిగిన కసి
- పనిభారం కారణంగా బుమ్రా తుది జట్టు ఎంపికపై ఇంకా అనిశ్చితి
- సిరీస్ ఫలితంతో సంబంధం లేకుండా బుమ్రా ఎంపికపై నిర్ణయమన్న కోచ్ గంభీర్

హైదరాబాద్ పెన్ పవర్: ఇంగ్లండ్‌తో జరుగుతున్న ఐదు టెస్టుల సిరీస్‌లో తొలి మ్యాచ్‌లో ఓటమి పాలైన టీమిండియాకు కీలకమైన రెండో టెస్టుకు ముందు పెద్ద ఊరట లభించింది. స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా శనివారం నెట్ ప్రాక్టీసుకు హాజరయ్యాడు. ఎడ్జ్‌బాస్టన్ టెస్టు కోసం జరుగుతున్న సన్నాహాల్లో భాగంగా అతను నెట్స్‌లో బౌలింగ్ చేయడంతో జట్టు బౌలింగ్ విభాగంపై అందరి దృష్టి కేంద్రీకృతమైంది. హెడింగ్లీలో జరిగిన తొలి టెస్టులో ఐదు వికెట్ల తేడాతో ఓడిపోయి 0–1తో వెనుకబడిన భారత్, రెండో టెస్టు కోసం శుక్రవారం నుంచే కసరత్తులు ప్రారంభించింది. అయితే, తొలి రోజు ప్రాక్టీస్ సెషన్‌కు బుమ్రా, మరో పేసర్ ప్రసిద్ధ్ కృష్ణ దూరంగా ఉండటంతో వారి ఫిట్‌నెస్‌పై అనుమానాలు తలెత్తాయి. దానికి తోడు బుమ్రాకు పనిభారం తగ్గించడానికి, రొటేషన్ విధానంలో భాగంగా రెండో టెస్టుకు విశ్రాంతి ఇస్తారని ప్రచారం జరిగింది. అయితే, శనివారం నాటి ప్రాక్టీస్‌తో ఆ అనుమానాలకు తెరపడింది. బుమ్రా, ప్రసిద్ధ్ కృష్ణ, మహమ్మద్ సిరాజ్ ముగ్గురూ నెట్స్‌లో బౌలింగ్ ప్రాక్టీస్ చేయడంతో జట్టులో కొత్త ఉత్సాహం నెలకొంది. తొలి రోజు బ్యాటింగ్‌పై దృష్టి పెట్టిన సిరాజ్, రెండో రోజు బౌలింగ్‌కు పదునుపెట్టాడు. బ్యాటర్ల విషయానికొస్తే, తొలి టెస్టులో అరంగేట్రం చేసిన సాయి సుదర్శన్ శనివారం నెట్స్‌లో బ్యాటింగ్ ప్రాక్టీస్ చేసిన వారిలో మొదటివాడిగా నిలిచాడు. మరోవైపు, కెప్టెన్ శుభ్‌మన్ గిల్, వైస్–కెప్టెన్ రిషభ్ పంత్, కేఎల్ రాహుల్, యశస్వి జైస్వాల్ శనివారం నాటి శిక్షణా శిబిరానికి దూరంగా ఉన్నారు. వీరంతా శుక్రవారం నెట్స్‌లో సుదీర్ఘంగా బ్యాటింగ్ ప్రాక్టీస్ చేయడమే ఇందుకు కారణం. బుమ్రా తిరిగి ప్రాక్టీస్‌లో పాల్గొనడం జట్టుకు సానుకూల సంకేతమే అయినప్పటికీ, ఎడ్జ్‌బాస్టన్ టెస్టు తుది జట్టులో అతని స్థానంపై ఇంకా స్పష్టత రాలేదు. తొలి టెస్టులో ఏకంగా 44 ఓవర్ల పాటు శ్రమించిన 31 ఏళ్ల బుమ్రాపై పనిభారం పెరగకుండా చూసేందుకు యాజమాన్యం ప్రణాళికలు రచిస్తోంది. ఈ సిరీస్‌లోని ఐదు టెస్టుల్లో కేవలం మూడింటిలోనే అతడిని ఆడించాలని భావిస్తున్నట్లు సమాచారం. హెడింగ్లీ ఓటమి అనంతరం మాట్లాడిన హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్, సిరీస్ ఫలితంతో సంబంధం లేకుండా బుమ్రా ఎంపికపై ప్రతీ మ్యాచ్‌కు ముందు ప్రత్యేకంగా నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు.

ప్రస్తుతం బౌలింగ్‌పై పూర్తిస్థాయిలో దృష్టి సారించిన టీమిండియా, ఎడ్జ్‌బాస్టన్‌లో విజయం సాధించి సిరీస్‌ను సమం చేయాలని పట్టుదలతో ఉంది. ఇందుకోసం తమ ప్రధాన పేసర్లు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండాలని జట్టు ఆశిస్తోంది.

శ్రీలంక చేతిలో ఘోర ఓటమి.. టెస్ట్ కెప్టెన్సీ నుంచి వైదొలిగిన శాంటో

హైదరాబాద్ పెన్ పవర్: శ్రీలంక తో రెండో టెస్టులో ఓటమి తర్వాత బంగ్లాదేశ్ టెస్ట్ కెప్టెన్ నజ్ముల్ హుస్సేన్ శాంటో తన సారధ్య బాధ్యతలకు రాజీనామా చేశాడు. కెప్టెన్సీ నుంచి తప్పుకుంటున్నట్లు శనివారం (జూన్ 28) అధికారికంగా ప్రకటించాడు. టెస్ట్ కెప్టెన్సీ నుంచి తప్పుకోవాలనే తన నిర్ణయాన్ని "కొన్ని రోజుల క్రితమే" బీసీబీ క్రికెట్ ఆపరేషన్స్ విభాగానికి తెలియజేసినట్లు నజ్ముల్ హుస్సేన్ శాంటో తెలిపారు. ఇటీవలే శాంటోను వన్డే కెప్టెన్ నుంచి తొలగించి అతని స్థానంలో మెహిదీ హసన్ మిరాజ్‌ను నియమించారు. టెస్ట్ కెప్టెన్ కు కూడా గుడ్ బై చెప్పడంతో మెహిదీ హసన్ మిరాజ్ కు టెస్ట్ నాయకత్వ బాధ్యతలను అప్పజెప్పే అవకాశం ఉంది. "టెస్ట్ ఫార్మాట్‌లో నేను ఇకపై కెప్టెన్‌గా కొనసాగాలనుకోవడం లేదు. జట్టు శ్రేయస్సు కోసమే నేను ఈ నిర్ణయం తీసుకున్నాను. మూడు ఫార్మాట్లకు ముగ్గురు వేర్వేరు కెప్టెన్లు ఉండటం 'సమంజసమైనది కాదు. నా నిర్ణయం జట్టుకు సహాయపడుతుందని నేను భావిస్తున్నాను. గత కొన్ని సంవత్సరాలుగా నేను డ్రెస్సింగ్ రూమ్‌లో భాగమయ్యాను. ఇది నా వ్యక్తిగత నిర్ణయం. ముగ్గురు వేర్వేరు కెప్టెన్లు జట్టులో ఉండడం కష్టమని నేను భావిస్తున్నాను". అని లంక చేతిలో ఓటమి తర్వాత జరిగిన విలేకరుల సమావేశంలో శాంటో అన్నాడు. శాంటో రెండో టెస్టులో విఫలమైనా.. తొలి టెస్టులో అదరగొట్టాడు. రెండు ఇన్నింగ్స్ ల్లో సెంచరీలు చేసి చరిత్ర సృష్టించాడు. ఇకపై శాంటో ప్లేయర్ గా మాత్రమే జట్టులో కొనసాగనున్నాడు. ఇక మ్యాచ్ విషయానికి వస్తే కొలంబో వేదికగా సింహాలీస్ స్పోర్ట్స్ క్లబ్ లో శ్రీలంకపై బంగ్లాదేశ్ ఇన్నింగ్స్ 78 పరుగుల తేడాతో ఓడిపోయింది. 6 వికెట్ల నష్టానికి 115 పరుగులతో నాలుగో రోజు ఆట ప్రారంభించిన బంగ్లాదేశ్ మరో 18 పరుగులు జోడించి చివరి నాలుగు వికెట్లను కోల్పోయింది. తొలి ఇన్నింగ్స్ లో బంగ్లాదేశ్ 247 పరుగులు చేసింది. అనంతరం శ్రీలంక తమ తొలి ఇన్నింగ్స్ లో 458 పరుగుల భారీ స్కోర్ చేసి 211 పరుగుల లీడ్ సంపాదించింది. రెండో ఇన్నింగ్స్ లో బంగ్లాదేశ్ 133 పరుగులకు ఆలౌటైంది.

మూడేళ్ళలో మూడు సర్జరీలు: బంగ్లా సిరీస్‌కు సూర్య డౌట్.. టీమిండియా టీ20 కెప్టెన్‌గా అక్షర్ పటేల్

హైదరాబాద్ పెన్ పవర్: ఆగస్టు నెలలో భారత క్రికెట్ జట్టు బంగ్లాదేశ్ గడ్డపై వన్డే, టీ20 సిరీస్ ఆడనుంది. ఈ పర్యటనలో భాగంగా మొత్తం మూడు వన్డేలతో పాటు మూడు టీ20 మ్యాచ్ లు ఆడనుంది. ఇంగ్లాండ్ తో టెస్ట్ సిరీస్ ముగిసిన వెంటనే టీమిండియా బంగ్లాదేశ్ కు వెళ్తుంది. ఆగస్టు నెలలో బంగ్లాదేశ్ తో జరగబోయే టీ20 సిరీస్ కు టీ20 కెప్టెన్ సూర్య దూరమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. సూర్య కుమార్ వరుస సర్జరీలతో ఇబ్బందిపడుతున్నాడు. గురువారం (జూన్ 26) జర్మనీలోని మ్యూనిచ్‌లో సూర్య స్పోర్ట్స్ హెర్నియా ఆపరేషన్ విజయవంతంగా ముగిసింది. 'కుడి వైపు పొత్తి కడుపులో ఉన్న హెర్నియాకు డాక్టర్లు విజయవంతంగా సర్జరీ చేశారు. మూడేళ్లలో సూర్యకుమార్‌కు ఇది మూడో సర్జరీ. 2023లో చీలమండకు ఆపరేషన్ చేయించుకున్న అతను 2024లోనూ స్పోర్ట్స్ హెర్నియాకు చికిత్స తీసుకున్నాడు. సర్జరీ చేయడంతో ఈ టీమిండియా టీ20 కెప్టెన్ ఎప్పుడు పూర్తిగా కోలుకుంటాడో ఖచ్చితంగా చెప్పలేని పరిస్థితి. ఈ ఆపరేషన్ తర్వాత రెండు వారాల్లో బెంగళూరులోని ఎన్‌సీఏలో రిహాబిలిటేషన్ మొదలుపెట్టనున్నాడు. బంగ్లాదేశ్ తో సిరీస్ కావడంతో ఈ సిరీస్ సమయానికి కోలుకున్నా సూర్యకు రెస్ట్ ఇచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. అదే జరిగితే ప్రస్తుతం భారత జట్టుకు వైస్ కెప్టెన్ గా ఉన్న అక్షర్ పటేల్ కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టవచ్చు. ఈ ఏడాది ప్రారంభంలో ఇంగ్లాండ్ తో జరిగిన టీ20 సిరీస్ కు అక్షర్ పటేల్ వైస్ కెప్టెన్ గా ఎంపికయ్యాడు. ఒకవేళ అక్షర్ కాకపోతే శుభమాన్ గిల్ కెప్టెన్ గా జట్టును నడిపించవచ్చు. ఆగస్టు 26న బంగ్లాదేశ్‌తో మూడు టీ20ల సిరీస్‌లో తలపడనుంది. 2026 లో భారత్ వేదికగా టీ20 వరల్డ్ కప్ జరగనుండడంతో ఈ సిరీస్ కు భారత క్రికెట్ జట్టు పూర్తి స్థాయి జట్టుతోనే బరిలోకి దిగే అవకాశం ఉంది. మూడు మ్యాచ్ ల టీ20 సిరీస్ లో భాగంగా తొలి మ్యాచ్ ఆగస్ట్ 26 న చట్టోగ్రామ్ వేదికగా జరుగుతుంది. ఆగస్టు 29, ఆగస్టు 31 న వరుసగా రెండు, మూడు టీ20 మ్యాచ్ లు జరుగుతాయి. ఆగస్టు 17 నుంచి 23 మధ్యలో మొదటగా వన్డే సిరీస్ జరుగుతుంది.

2025లో బంగ్లాదేశ్ పర్యటనకు భారత జట్టు షెడ్యూల్:

ఆగస్టు 17.. భారత్ వర్సెస్ బంగ్లాదేశ్.. తొలి వన్డే.. మీర్పూర్
ఆగస్టు 20.. భారత్ వర్సెస్ బంగ్లాదేశ్.. రెండో వన్డే.. మీర్పూర్
ఆగస్టు 23.. భారత్ వర్సెస్ బంగ్లాదేశ్.. మూడో వన్డే.. చట్టోగ్రామ్
ఆగస్టు 26 భారత్ వర్సెస్ బంగ్లాదేశ్.. తొలి టీ20.. చట్టోగ్రామ్
ఆగస్టు 29 భారత్ వర్సెస్ బంగ్లాదేశ్.. 2వ టీ20.. మీర్పూర్
ఆగస్టు 31 భారత్ వర్సెస్ బంగ్లాదేశ్.. 3వ టీ20.. మీర్పూర్

ఆకాంక్ష శర్మ తన గ్లామర్ డోస్ పెంచింది

ఖైదీ2లో ఢిల్లీకి భార్యగా ఆ స్టార్ హీరోయిన్?

కార్తీ హీరోగా లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో వచ్చిన ఖైదీ సినిమా ఎంత పెద్ద హిట్టైందో తెలిసిందే. ఈ సినిమాకు సీక్వెల్ గా ఖైదీ2 రాబోతుండగా, ఆల్రెడీ ఆ మూవీ కోసం ఆడియన్స్ ఎంతో ఎగ్జైటెడ్ గా ఉన్నారు. అయితే ఖైదీ2 లో సౌత్ స్టార్ హీరోయిన్ అనుష్క శెట్టి నటించే అవకాశాలున్నట్టు వార్తలు వస్తుండటంతో ఖైదీ2 పై ఉన్న అంచనాలు ఇంకాస్త పెరిగాయి. అనుష్క ఖైదీ2 లో నటిస్తుందని వార్త అలా వచ్చిందో లేదో వెంటనే ఈ వార్త సోషల్ మీడియాలో వైరల్ అయిపోయింది. ఖైదీ2లో అనుష్క దిల్లీ భార్యగా మరింత పవర్‌ఫుల్ రోల్ లో నటించనుందనే వార్త ఇప్పుడు కోలీవుడ్ లో హాట్ టాపిక్ గా మారింది. అయితే ఇన్ని వార్తలొస్తున్నప్పటికీ ఈ విషయంలో నిర్మాతల నుంచి ఎలాంటి అధికారిక ప్రకటనా వచ్చింది లేదు. కాబట్టి ఖైదీ2లో అనుష్క నటిస్తుందనే వార్త ఇప్పటికైతే కేవలం ఊహాగానాలు మాత్రమే. ఖైదీ2లో అనుష్క క్యారెక్టర్ చాలా స్పెషల్ గా ఉండటంతో పాటూ, ఆ క్యారెక్టర్ కేవలం సపోర్టింగ్ రోల్ లా ఉండదని మొదట్లో వార్త రాగా, తర్వాత ఆ న్యూస్ వైరలైంది. అనుష్క మాత్రమే కాదు, ఖైదీ2లో మరికొన్ని క్యామియోలు కూడా ఆడియన్స్ ను ఆశ్చర్యపరచనున్నట్టు తెలుస్తున్నాయి. లోకేష్ సినిమాటిక్ యూనివర్స్ లో భాగంగా ఖైదీ2 సినిమాలో విక్రమ్, రోలెక్స్ గా కమల్ హాసన్, సూర్య కూడా జతకట్టే అవకాశాలున్నట్టు టాక్ వినిపిస్తోంది. నిజంగానే వీరంతా ఖైదీ2 లో నటిస్తే ఈ సినిమా సౌత్ ఇండియన్ సినిమాలోనే అతి పెద్ద సినిమాగా మారే అవకాశముంది.

అయితే అనుష్క, కార్తీ కలిసి స్క్రీన్ ను షేర్ చేసుకోవడం ఇది మొదటిసారేం కాదు. గతంలో వీరిద్దరూ కలిసి అలెక్స్ పాండియన్ లో నటించారు. ఆ తర్వాత కార్తీ నటించిన శకుని, ఊపిరి సినిమాల్లో అనుష్క స్పెషల్ క్యామియో చేశారు. ఇప్పుడు ఖైదీ2లో వీరిద్దరూ కలిసి నటిస్తే అది సినిమాకు మంచి హైప్ ను తీసుకురాగలదు. అయితే అనుష్క ఖైదీ2 చేస్తున్నారా లేదా అనేది మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన వచ్చే వరకు క్లారిటీ రాదు. అనుష్క ఖైదీ2 చేసినా చేయకపోయినా ఆమె కెరీర్ మాత్రం చాలా స్ట్రాంగ్ గా కనిపిస్తుంది. ప్రస్తుతం క్రిష్ జాగర్లమూడి దర్శకత్వంలో ఘాటి చేస్తున్న అనుష్క ఆ సినిమాను జులై 11న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్ గా రాబోతున్న ఈ సినిమాలో అనుష్క క్యారెక్టర్ చాలా కొత్తగా ఉంటుందని ఆల్రెడీ రిలీజైన టీజర్ చూస్తుంటే తెలుస్తోంది. ఘాటితో పాటూ మలయాళ సినిమా కథనర్ లో కూడా అనుష్క ఓ కీలక పాత్ర చేస్తున్నారు.

పాలక్ తివారీ తన స్టైల్‌పై గందరగోళం లో ఉన్నారు

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com